

నెల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏదో అర్జీ వచ్చిందా.. దాన్ని ఫార్వార్డ్ చేసి చేతులు దులుపుకున్నామా ?.. అన్న పద్ధతి ఇక మీదట పనికిరాదు..! అర్జీనేగా వచ్చింది.. దానికి ఏదో ఒక సమాధానం చెప్పి తప్పించుకుందాంలే.. అన్న ధోరణి కూడా ఇక క్షేత్రస్థాయి అధికారుల్లో ఉండడానికి వీల్లేదు..! ఈ నిర్లక్ష్యపు విధానానికి ఇక స్వస్తి చెప్పాల్సిందే..! ఎందుకంటే ప్రజాఅర్జీలపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించింది. ప్రతి సోమవారం కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ శాఖల్లో నిర్వహించే ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలే కాకుండా గ్రామసభలు, ప్రజాప్రతినిధుల సమావేశాల్లో వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తున్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన వినతులను సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిశీలించాలి. అంతేకాక పరిష్కారం చూపేలా ప్రభుత్వం నూతన విధానాలను ప్రవేశపెట్టింది.

ఆడిట్ కీలకం

అర్జీల పరిష్కారంలో కీలకమైంది ఆడిట్ విధానం. ఈ విధానంలో భాగంగా కింది స్థాయి అధికారులు సమస్య పరిష్కారమైనట్లుగా చూపిస్తూ క్లోజ్ చేసిన అర్జీలను పైస్థాయిలో మానిటరింగ్ చేస్తారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఆడిట్‌సెల్‌ను కలెక్టర్ ఓ ఆనంద్ ఏర్పాటు చేశారు. ఇందులో తొమ్మిదిమంది ఉద్యోగులు ఉంటారు. ఒక్కొక్కరికి కొన్నిశాఖలను కేటాయించారు. ఆయాశాఖల అర్జీలను వారు పర్యవేక్షిస్తారు. మండల స్థాయి నుంచి అర్జీ పరిష్కారమైనట్లు క్లోజ్ అవ్వగానే ఈ ఆడిట్ సెల్‌కు అది ఫార్వార్డ్ అవుతుంది. ఈ సెల్ నుంచి సంబంధిత అర్జీదారుడికి నేరుగా ఫోన్ చేసి మాట్లాడతారు. సదరు అర్జీదారుడు సంతృప్తి చెందకపోతే సమస్యను లోతుగా పరిశీలిస్తారు. అది పరిష్కరించబడిందా...? లేదా..? అన్నది నిర్ధారించుకుంటారు. ఒకవేళ పరిష్కరించ గలిగినా, మండల అధికారులు పరిష్కరించకపోతే ఆడిట్ సెల్ నుంచే ఆ అర్జీని రీ ఓపెన్ చేస్తారు. ఇలా రీ ఓపెన్ అయిన అర్జీలను జిల్లా ఉన్నతాధికారులు సమీక్షిస్తారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకూ ఆడిట్ సెల్ నుంచి పర్యవేక్షణ ఉంటుంది.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆడిట్ సెల్‌లో ఉద్యోగులు

- ప్రజల సమస్యలు తీర్చేందుకు ప్రత్యేక ఆడిట్
- తొమ్మిది మందితో కలెక్టరేట్‌లో సెల్ ఏర్పాటు
- 18 మంది జిల్లా అధికారులకు బాధ్యతలు
- ప్రతి అర్జీదారుడితో నేరుగా మాట్లాడాల్సిందే ?
- వారు సంతృప్తి చెందకుంటే అర్జీ రీ ఓపెన్
- అలా జరిగిందంటే బాధ్యులకు మెమోలు

పరిష్కారమే లక్ష్యం

18 మందికి బాధ్యతలు

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆడిట్‌సెల్‌నే కాకుండా ఆడిట్ బాధ్యతలను మరో18 మంది జిల్లాస్థాయి అధికారులకు కలెక్టర్ అప్పగించారు. వీరిలో అర్జీలు ఎక్కువ వచ్చే ప్రధానమైన శాఖల అధికారులున్నారు. జడ్పీ సీఈవో విద్యారమను ఈ ఆడిట్ విభాగానికి నోడల్ అధికారిగా నియమించారు. ఈ అధికారులు కూడా 10 శాతం అర్జీలను ర్యాండమ్‌గా ఆడిట్ చేయాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా అంతిమంగా అర్జీదారుడి సమస్యను పరిష్కరించనున్నారు. ఇప్పటివరకూ కలెక్టరేట్‌లోని ఆడిట్‌సెల్‌కు 16,179 అర్జీలు పరిష్కారమైనట్లుగా వచ్చాయి. వాటిలో 11,767 అర్జీలపై ఆడిట్ పూర్తి చేశారు. నేరుగా అర్జీదారులతో మాట్లాడి నివేదికలు సిద్ధం చేశారు. అందులో భాగంగా 459 అర్జీలను రీ ఓపెన్ చేశారు. ఇవన్నీ పరిష్కరించగలిగినవి అయినా మండల స్థాయిలో పరిష్కరించలేదని నిర్ధారించారు. ఇందుకు బాధ్యులైన అధికారులకు మెమోలు జారీ చేసేందుకు వీలుగా నివేదికలు సిద్ధం చేసి కలెక్టర్‌కు అందించనున్నారు.

అలానే 18 మంది జిల్లా స్థాయి అధికారులకు 2543 పరిష్కారమైన అర్జీలు పార్వర్డ్ అయ్యాయి. ఇందులో సీఎం కార్యాలయం నుంచి వచ్చిన 766 అర్జీలు కూడా ఉన్నాయి. ఇప్పటి వరకూ 2196 అర్జీలకు సంబంధించి ఆడిట్ పూర్తి చేశారు. అందులో 77 అర్జీలను రీఓపెన్ చేశారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చినా వాటిలో 48 అర్జీలు రీఓపెన్ కావడం గమనార్హం. అంటే క్షేత్రస్థాయి అధికారులు ఏ స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తున్నారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇలా నిర్లక్ష్యంగానో లేక ఉద్దేశపూర్వకంగానో సమస్యను పరిష్కరించ కుండా అర్జీలను క్లోజ్ చేస్తున్న మండల అధికారులకు మెమోలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్నాళ్లపాటు ఇదే విధానం కొనసాగితే చాలా వరకూ అర్జీలు క్షేత్రస్థాయిలోనే పరిష్కార మయ్యే అవకాశం ఉందని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఇబ్బందులు తలెత్తకుండా
ధాన్యం కొనుగోళ్లు

- రైతులకు మద్దత ధర అందేలా చూడాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఆయన చాంబర్‌లో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈనెల 25లోగా ఈ క్రాప్ పూర్తి చేయాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులకు అవసరమైన బ్యాంకు రుణాలను మంజూరు చేయించాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పీఏసీఎస్‌ల్లో పురుగు మందు రహిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పైలట్ ప్రాజెక్టుగా మార్కెటింగ్ శాఖ పరిధిలో ఓ గోదామును జాతీయ గోదాముల అభివృద్ధి ప్రాధికార సంస్థ, న్యూఢిల్లీ వారి గుర్తింపు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విడతల వారీగా అన్నీ గోదాములకు ఈ గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దగదర్తి పీఏసీఎస్‌లో పురుగు మందు రహిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేయనున్నామని డీసీవో గుర్రప్ప తెలియజేశారు. జిల్లాలో మూడువేల ఎకరాల్లో డ్రిప్ పరికరాలు అమర్చినట్లు ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సంస్థ పీడీ మాల కొండయ్య, మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత, మార్క్‌ఫెడ్ డీఎం పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు ప్రాంతంలో నల్లి సోకటంతో గిడసబారిన మిరప తోట

ముంచుతున్న మిర్చి!

- మిరప పైరుకు తెగుళ్లు, తామర పురుగు బెడద
- దారుణంగా పడిపోయిన దిగుబడులు, ధరలు
- ఈ ఏడాది భారీ నష్టాలే అంటున్న అన్నదాతలు
- ఏసీలో నిల్వచేసిన రైతుల పరిస్థితి దయనీయం

కందుకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎర్ర బంగారంగా పిలుచుకునే మిర్చి సాగు ఈ ఏడాది రైతుకు శాపంగా పరిణమించింది. ధరలు, దిగుబడి తగ్గడం, తెగుళ్ల ఇలా అన్నిరకాల సమస్యలు సాగుదారులపై ముప్పేట దాడి చేస్తుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. ప్రతిఏడాది లాభాలు పొందిన మిరప రైతులు ఈసారి మాత్రం పరిస్థితులు తారుమారయ్యాయి. జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకు రోజుకో రీతిలో పైరు పెరుగుతూ కొమ్మలు నిండుగా పూత పిందెతో కళకళలా డాల్సిన మిరపతో టలు నల్లి, తామర పురుగు దాటికి కొనలు మాడి పోయి కళావిహీనంగా కనిపిస్తున్నాయి.

ఈ ఏడాది దిగుబడులు 25 శాతం మించవు..

దీంతో సాధారణ దిగుబడుల్లో 25శాతం కూడా వచ్చే పరిస్థితి లేదు. మరోపక్క మిర్చి ధరలు నేలచూపులు చూస్తుండటంతో దారుణంగా నష్టపోక తప్పని పరిస్థితులు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఏపంటలైనా డిమాండ్ సప్లై సూత్రంపై ఆధారపడి మార్కెట్లో ధరలు పలుకుతుంటాయి. పంట ఉత్పత్తులు అంచనాలకు మించి వస్తే ధరలు తగ్గటం, దిగు బడులు అంచనాలకు అందుకోలేకపోతే గిరాకీ ఏర్పడి ధరలు పెరగటం సహజంగా జరుగుతుంది. అయితే మిర్చి విషయంలో అనూహ్యంగా దిగుబడులు పడిపోతున్నా ధరలు కూడా రోజుకోరీతిలో తగ్గిపోతుండటం అంతుబట్టక

- మిగతా 6లో

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్
ప్రారంభం

- తొలిరోజు పరీక్షలు ప్రశాంతం


నెల్లూరు : జీవీఆర్‌ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు తదితరులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రారంభం కాగా, తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 284 మంది హాజరు కావాల్సి ఉండగా, 264 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 265 మంది హాజరు కావాల్సి ఉండగా 246 మంది హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని జీవీఆర్ ఆర్ జూనియర్ కళాశాల కేంద్రాన్ని ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌లు నమోదు కాలేదన్నారు. తొలి విడతగా 11 పరీక్ష కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయని, ఈ నెల 10 నుంచి రెండోవిడత ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయన్నారు. ఈ పరీక్షలను 88 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు, నాలుగు కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించనున్నామని వివరించారు. మూడు విడతలుగా జరిగే ఈ పరీక్షలకు జనరల్ విద్యార్థులకు 121 కేంద్రాలు, ఒకేషనల్ విద్యార్థులకు 21 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అనధికార లే అవుట్లపై
నుడా.. కొరడా!

- 2019-24 మధ్యకాలంలో వేసిన వాటిపై దృష్టి

వివరాలు 6లో..

- గత ప్రభుత్వంలో ఆగిన మరుగుదొడ్ల పథకం
- కూటమి సర్కారులో పునఃప్రారంభం
- వ్యక్తిగతానికి 6 వేలు, సామాజికానికి 526 దరఖాస్తులు
- అర్హులంతా దరఖాస్తు చేసుకోండి : ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

స్వచ్ఛాంధ్రకు
మళ్లీ ఊపిరి



కోవూరు సచివాలయం వద్ద నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఆగిపోయిన స్వచ్ఛాంధ్ర మరుగుదొడ్ల పథకానికి కూటమి ప్రభుత్వం మళ్లీ ఊపిరిపోసింది. స్వచ్ఛ భారత్ -స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకూడదని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించడం ద్వారా, ఆరోగ్యంగా ఉండాలన్న ఆకాంక్షతో 2014-19వరకు అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. దీంతో గ్రామాల్లో సైతం ఇళ్లలోనే పేదలంతా మరుగుదొడ్లను నిర్మించుకుని బహిరంగమలవిసర్జనకు స్వస్తి పలికారు.

పథకాన్ని నీరుగార్చిన వైసీపీ

ఈ పథకాన్ని వందశాతం ప్రజలకు అందించాల్సి ఉండగా, రాష్ట్రంలో 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో దాన్ని పూర్తిగా అటకెక్కించింది. స్వచ్ఛాంధ్ర లక్ష్యాన్ని నీరుగార్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకం ఊపిరిపోసుకుంది. దీంతో పల్లెలతోపాటు పట్టణాలు, నగరాలు, అన్నీ ప్రాంతాల్లో అవసరమైనవారికి మరుగుదొడ్ల నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

ప్రారంభమైన పనులు

జిల్లాలో ఇంకా మిగిలి ఉన్న గృహాలు, కొత్తగా నిర్మించుకున్న ఇళ్ల యజమానులు వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. దీంతో ఇప్పటివరకు ఆరు వేలకుపైగా వ్యక్తిగత మరుగుదొడ్లకు దరఖాస్తులు అందాయి. ఒక్కొక్క మరుగుదొడ్డికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15వేలు అందజేయనున్నాయి. కాగా ఇప్పటివరకు 834 మరుగుదొడ్లు పూర్తి అయ్యాయి. మిగతా మరుగుదొడ్ల పనులు జరుగుతున్నాయి. అలాగే సామాజిక మరుగుదొడ్లను ఆలయం, బస్టాండు, బీచ్‌లు, తదితర ప్రాంతాల్లో మంజూరు చేస్తుండడంతో వాటికి 526 దరఖాస్తులు వచ్చాయి. వాటికి ఒక్కోదానికి రూ.3లక్షల వరకు మంజూరు చేస్తున్నారు. ఇప్పటి వరకు 88సామాజిక మరుగుదొడ్లు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి 486 దరఖాస్తులు రాగా, వాటికి ఒక్కో మరుగుదొడ్డికి రూ. 36వేలు మంజూరు చేయనున్నారు. ఇప్పటికి ఇవి 136 పూర్తికాగా, మిగిలినవాటి పనులు జరుగుతున్నాయి.

అర్హులంతా దరఖాస్తు చేసుకోవచ్చు

మరుగుదొడ్ల నిర్మాణానికి తెల్లరేషన్ కార్డు కలిగిన పేదలంతా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యక్తిగత మరుగుదొడ్డికి రూ.15వేలు, సామాజిక మరుగుదొడ్లకు రూ. 3లక్షలు, ప్రభుత్వ కార్యాలయాలకు రూ. 36వేలు నిధులు మంజూరు చేస్తాం. ఈ పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకుని బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జనకు స్వస్తి పలకాలి.

- డీ వెంకటరమణ, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

దళారులు చెప్పిందే ధర

అల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉప్పు రైతులను సైతం దళారులు వదలకపోవడంతో వారు ప్రతి ఏటా నష్టపోతున్నారు. తాము చెప్పిందే ధరగా దళారులు ఉప్పును కొనుగోళ్లు చేస్తుంటారు. లేదంటే కుప్పలు అక్కడే ఉండాల్సిందే. పూటగడవడం కష్టంగా మారడంతో కొంతమంది రైతులు తాము ఉత్పత్తి చేసిన ఉప్పును తెగనమ్ముకోవాల్సి వస్తున్నది. ఉప్పునకు గిట్టుబాటు ధర ఉన్నా దళారులు చెప్పే ధరకే విక్రయించాల్సి వస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో గతంలో జిల్లావ్యాప్తంగా 50వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉత్పత్తి చేసే ఉప్పు ప్రస్తుతం కేవలం 10వేల ఎకరాల్లోనే సాగుచేస్తున్నారు. అదీ కూడా అల్లూరు మండలంలోనే ఏడువేల ఎకరాల్లో ఉత్పత్తి చేస్తున్నారు.

నిల్వ సౌకర్యం లేకనే...

తాము ఉత్పత్తి చేసిన ఉప్పును నిల్వ చేసుకునేందుకు రైతులకు వసతి లేదు. దీంతో అక్కడికక్కడే చెప్పిన ధరకే ఉప్పు విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా దళారులు దోపిడీకి పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. సాధారణంగా జనవరి నుంచి ఉప్పు ఉత్పత్తికి రైతులు సన్నాహాలు చేస్తారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచి ఉప్పు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఉత్పత్తి చేసిన ఉప్పును రైతు తన అవసరాన్ని బట్టి విక్రయించుకునే పరిస్థితి ఉంటుంది.


ఉప్పును లారీకి లోడ్ చేస్తున్న హమాలీలు

- వారు చెప్పిన రేటుకే ఉప్పు విక్రయాలు
- పదేళ్లుగా ఇదే తంతు
- పండించిన రైతుకు దక్కని ఫలితం
- ఏటేటా తగ్గుతున్న ఉత్పత్తి

ధరల పరిస్థితి ఇదీ...

క్వింటా ఉప్పు ఉత్పత్తికి సుమారుగా రూ.100 నుంచి రూ.150 ఖర్చవుతోంది. ఇందుకు రెట్టింపు ధరకు విక్రయిస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. కానీ ఇక్కడ దళారులు మాత్రం రూ.150 నుంచి రూ.200లోపే ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. గత ఏప్రిల్‌లో ఉత్పత్తి చేసిన నాణ్యమైన ఉప్పు ధర నేడు రూ.300 పలుకుతోంది. ఇటీవల రూ.350 ఉన్న ధర మళ్లీ కొత్త ఉత్పత్తి ప్రారంభమయ్యే నాటికి పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

పదేళ్లుగా ఇదే తంతు

గత దశాబ్దకాలంగా ఉప్పు రైతులను దళారులు అడ్డంగా దోచుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. దీంతో ఉప్పు రైతులు ఎప్పటికీ అలాగే ఉండిపోతున్నారు. పెట్టుబడి పెట్టడం ఒక వంతైతే, ఉత్పత్తి చేసిన ఉప్పునకు గిట్టుబాటు ధర లేకపోవడం మరో సమస్యగా మారింది. రైతుల వద్ద తీసుకునే ధరకంటే రెండింతలుగా మార్కెట్లో దళారులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఉప్పు నిల్వలకు గోదాములు ఏర్పాటు చేయాలి. అలాగే వారికి గిట్టుబాటు ధర కల్పించాలి. సాల్ట్ బోర్డు ఏర్పాటుకు కృషి చేయాలి.

ఉప్పునకు ప్రత్యేక గుర్తింపు ఉండాలి



అన్నీ పంటల మాదిరిగానే ఉప్పునకు ప్రత్యేక గుర్తింపు ఉండాలి. ప్రత్యేక శాఖను కేటాయించి ఉప్పు రైతులకు సహ కారం అందించాలి. ప్రతీ పంటకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్టే ఉప్పు పంటకూ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తద్వారా రైతులను ఆదుకుని దళారీ వ్యవస్థను రూపుమాపాలి.

- అనంతరాజు బాలకృష్ణంరాజు, ఉప్పు రైతు, అల్లూరు. అల్లూరు మండలం

దళారులు దోచుకుంటున్నారు..



దళారుల కారణం గా ఉప్పు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కష్టపడి ఉత్పత్తి చేస్తున్న ఉప్పును దళారుల చేతుల్లో పెట్టి వారిచ్చిన ధరను తీసుకునే దౌర్భాగ్య పరిస్థితి వాటిల్లింది. దశాబ్దాల కాలంగా వారి చేతుల్లోనే నలిగిపోతున్నాం. ప్రభుత్వ చొరవ తీసుకుంటే తప్ప ఉప్పు రైతుల మనుగడ కష్టం.

- దానం రజని, ఉప్పురైతు, ఇస్కపల్లి మజరా జవ్వాగు, అల్లూరు మండలం

పట్టించుకునేవారేరి ?



అన్నీ రంగాల రైతుల పరిస్థితి ఓ ఎత్తయితే, ఉప్పు రైతులది మరో ఎత్తు. అత్యధికంగా నష్టపోయేది ఉప్పు రైతులే. ఈ విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే రైతులు అభివృద్ధి చెందే పరిస్థితి లేదు.

- దానం జాషువా, ఉప్పురైతు, ఇస్కపల్లి మజరా జవ్వాగు, అల్లూరు మండలం

వీల్‌చైర్లలో వస్తువులు..
దివ్యాంగులకు అవస్థలు

- జీజీహెచ్‌లో తీవ్ర అసౌకర్యం
- దాతలిచ్చిన కుర్చీలు ఇతర పనులకు వినియోగం



వీల్‌చైర్ లేక దివ్యాంగ వృద్ధుడిని నడిపించుకుపోతున్న కుటుంబ సభ్యులు



డాక్టర్ వద్దకు వెళ్లాలంటే సొంత వీల్‌చైరే దిక్కు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగులకు కష్టాలు తప్పడం లేదు. ఆసుపత్రి నిర్వాహకులు కనీసం వీల్‌చైర్లు కూడా అందుబాటులో ఉంచకపోవటంతో దివ్యాంగులు నానా అగచాట్లు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 32,638 మంది దివ్యాంగులు ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.6 వేలు పింఛను తీసుకుంటున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం నుంచి అర్హత లేనివారు కూడా దివ్యాంగుల పింఛను తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో దివ్యాంగులందరినీ పరీక్షించి వారు పెన్షన్‌కు అర్హులా... కాదా.. అని తేల్చే పనిలో ఉంది. ఇందులో భాగంగా జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రతీ రోజూ 400 మంది దివ్యాంగులను పరీక్షించేలా నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఆయా కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు చేయలేదు. ఇక్కడికి వచ్చే దివ్యాంగులలో ఎక్కువ మంది నడవలేని వారున్నారు. వీరికి వీల్‌చైర్ తప్పనిసరి. ఇదిలా ఉండగా పలువురు దాతలు జీజీహెచ్‌కు 15కుపైగా వీల్‌చైర్లు ఇచ్చి ఉన్నారు. మంగళవారం నగరంలోని కందప్ప మేస్త్రీ సత్రం నిర్వాహకులు కూడా రెండు వీల్‌చైర్లు, మరో రెండు ట్రైసైకిళ్లు వితరణ చేశారు. కానీ, దాతలిచ్చిన ఈ వీల్‌చైర్లను జీజీహెచ్ అధికారులు దివ్యాంగులకు అందుబాటులో ఉంచటం లేదు. ఆఫీసు ఫైళ్లు, రోగుల వార్డుల్లో దుప్పట్లు తరలించేందుకు వాడుతున్నారు. దీంతో దివ్యాంగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు దివ్యాంగుల కుటుంబ సభ్యులు స్వంతంగా వీల్‌చైర్ తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఆసుపత్రి అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



వీల్‌చైర్‌లో జీజీహెచ్ కార్యాలయ పుస్తకాల తరలింపు



వీల్‌చైర్‌లో రోగుల దుప్పట్లు తీసుకుపోతున్న ఆసుపత్రి సిబ్బంది

ప్రభగిరిపట్నానికి

పూర్వ వైభవం దక్కేనా!?


- మసకబారుతున్న ఏళ్లనాటి చరిత్ర!
- కనుమరుగవుతున్న నాటి ఆనవాళ్లు

మరిన్ని

పొదలకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరుకు సుమారు 10 కి.మీ దూరంలో ఉన్న ప్రభగిరిపట్నం నాడు చరిత్ర పుటల్లో నిలిచింది. ప్రస్తుతం ఉన్న ఆనవాళ్లు కూడా కనుమరుగవుతోంది. 11వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయులకు సామంతరాజుగా ఉన్న ప్రభాకరవర్ధనుడు పాలించడం వల్ల ఈ ప్రాంతానికి ప్రభగిరి పట్నం అన్న పేరు వచ్చినట్లు తెలుస్తోంది. రెండు వైపులా ఉన్న కొండల వలన శత్రుదుర్భేదంగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని ప్రభాకరవర్ధనుడు పాలించేవాడు. దీంతో ఈ గ్రామం వ్యాపార కేంద్రంగా మారి నిత్యం వర్తకులతో రద్దీగా ఉండేది. ప్రభాకర వర్ధనుడికి దైవభక్తి ఎక్కువ కావడంతో ఈ ప్రాంతంలో 101 దేవాలయాలు, 101 కోనేర్లు నిర్మించారు. వీటిలో పెరుమాళ్లస్వామి, అభయాంజనేయస్వామి, శివాలయాలు ముఖ్యమైనవి. ప్రభాకరవర్ధనుడు నిత్యం సమీపంలోని పెన్నానదిలో స్నానమాచరించి సొరంగ మార్గం ద్వారా ఆలయానికి చేరుకుని స్వామివార్లకు పూజలు చేసేవారని పురాణాలు చెబుతున్నాయి. తన శిల్పకళా వైభవానికి చిహ్నంగా భావించి నిర్మించిన ఆలయాలు కాలగమనంలో శత్రురాజులు జరిపిన దండయాత్రలో చాలావరకు ధ్వంసమవగా మిగిలిన దేవాలయాలు, కోనేర్లు కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకున్నాయి. నేటికి గ్రామంలో అక్కడక్కడా పురాతన చరిత్రకు సాక్షంగా దేవాలయాలు, కోనేరులు దర్శనమిస్తాయి. పురాతన కోనేరులలో నీటిని గ్రామస్థులు తాగునీటి వాడకంతోపాటు వ్యవసాయ వాడకాలకు వినియోగిస్తున్నారు. ఆలయాలు, కోనేర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. దాంతో మిగిలిన దేవాలయాలతోపాటుగా శివాలయం పూర్తిగా ధ్వంసమైంది. దాంతో స్థానికులు దేవాలయాల దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో అప్పటి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. అభయాంజనేయస్వామికి ఎంతో అతీతశక్తులు ఉన్నట్లు గ్రామస్థుల నమ్మకం. అందువలనే ఇక్కడ ప్రతి ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలతోపాటుగా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామిని దర్శనం చేసుకుంటారు. ఉత్సవాలలో ఎడ్ల పందాలు, కీలుగుర్రం నాట్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. నేటికీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో అనారోగ్యంతో బాధపడేవారు నిద్ర చేస్తే తమకు ఆరోగ్యం కుదుటపడుతుందనే నమ్మకముంది. ఇంత చరిత్ర ఉన్న దేవాలయంలో స్వామివార్లకు ధూపదీప నైవేద్యం పెట్టే పూజారికి ఇప్పటికీ గ్రామస్థులు చందాలతో జీతం ఇస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది.



చెట్టు కింద ఉన్న పురాతన శిలా విగ్రహాలు



పురాతన ఆంజనేయస్వామి ఆలయం

• పురాతన విగ్రహాలకు భద్రత కరువు

దెబ్బతిన్న విగ్రహాలను అభయాంజనేయ స్వామి ఆలయంలోని చెట్టు కింద ఉంచడంతో ఎంతో చరిత్ర కలిగిన దేవతామూర్తుల విగ్రహాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దర్శనమిస్తున్నాయి. ఎంతో విలువైన విగ్రహాలను జాగ్రత్తగా భద్రపరచకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘన చరిత్ర కలిగిన దేవాలయాలను కాపాడాల్సిన అధికారులు, గత పాలకులు తమకేం పట్టనట్లు వ్యవహరించారు. ఇకనైనా పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేసి ఆలయానికి, గ్రామానికి పూర్వవైభవాన్ని తీసుకురావాలని పర్యావరణ, పురావస్తు ప్రేమికులు కోరుతున్నారు.

సచివాలయ ఏఎన్‌ఎంలకు
ఉద్యోగోన్నతి కల్పించండి

- డీఎంహెచ్‌వోకు ఎన్‌జీవో సంఘం వినతి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఏఎన్ఎంలకు గ్రేడ్-3 ఉద్యోన్నతి కల్పించాలని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు మాట్లాడుతూ సచివాలయ ఏఎన్ఎంలు ఉద్యోగోన్నతి కోసం వేచి చూస్తున్నారన్నారు. దీనిపై కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఈ నెల 2న ఆదేశాలు జారీ చేశారన్నారు. వాటి ప్రకారం ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు నందిమండలం అంజనేయవర్మ, పులి సతీష్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు

8 వరకు దరఖాస్తుల గడువు పొడిగింపు

- 10న మద్యం దుకాణాలకు లక్కీ డిప్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గీత కులాల వారికి మద్యం దుకాణాల కేటాయింపునకు ఈనెల 5లోగా ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. అయితే ఈ గడువును ఈనెల 8వతేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 18 మద్యం దుకాణాలను గీతకులాలకు కేటాయించారు. గీతకులాల్లో ఉప కులాలకు సంబంధించి గౌడ్‌కు 6, గౌడకు 7, గమళ్ళకు 4, గొండ్లకు 1 దుకాణాన్ని లాటరీ విధానంలో కేటాయించనున్నారు. ఈనెల8 వరకు దరఖాస్తులు స్వీకరించి, 10న జెడ్పీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లక్కీడిప్ తీసి, దుకాణాలు కేటాయించనున్నారు. బుధవారం వరకు ఎక్సైజ్‌శాఖ 27 దరఖాస్తులు అందాయి. వాటిలో నెల్లూరు కార్పొరేషన్‌కు కేటాయించిన మద్యం దుకాణానికి అత్యధికంగా 7 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

సోమశిలలో 65.936 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 1,317 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 65.936 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సైనిక సంక్షేమ అధికారిగా హరికృష్ణ



నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా జీ హరికృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అనధికార లేఅవుట్లపై
నుడా.. కొరడా!

- 2019-24 మధ్యకాలంలో వేసిన వాటిపై దృష్టి
- జాబితా ప్రకారం మున్సిపల్, మండల అధికారుల చర్యలు
- లేఅవుట్లలో హద్దురాళ్లు, కాలువలు, రోడ్లు ధ్వంసం
- ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో గుబులు
- వైసీపీలో కాకరేపుతున్న ఈ వ్యవహారం



వెంగాయగారిపాలెం రోడ్డులో అనధికార లేఅవుట్‌లో ధ్వంసమైన సీసీ కాలువలు

కావలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో 2019-24 మధ్య వేసిన లేఅవుట్లపై నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) అధికారులు దృష్టి సారించారు. సర్వే నెంబర్లతో సహా అనధికార లేఅవుట్లను గుర్తించి వాటి వివరాలను మున్సిపల్ అధికారులకు, ఎంపీడీవోలకు పంపి చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానిక అధికర యంత్రాంగం ఆ జాబితాలు పట్టుకుని అనధికార లేఅవుట్లపై పడ్డారు. హద్దు రాళ్లు, కాలువలు, రోడ్లను ఎక్స్‌వేటర్ల సహాయంతో ధ్వంసం చేస్తుండటంతో రియల్టర్ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇక రూ.లక్షలు పోసి ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజల్లోనూ ఆందోళన రేగుతోంది.

• ప్రభుత్వ స్థలాలు ఏమైనట్టు?

కావలి పురపాలక సంఘ పరిధిలో వేసిన లేఅవుట్లలో ఉన్న 128 ఎకరాల ప్రభుత్వ భూమి ఎక్కడుందో దానిని స్వాధీనం చేసుకుంటారా!? లేదా!? అనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. మరోవైపు అనధికార లేఅవుట్లలో హద్దురాళ్లు, కాలువలు, రోడ్లు తొలగించే ప్రక్రియను కూడా ముమ్మరంగా చేపట్టారు. ప్రభుత్వ భూములు ఉంటే ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తరచూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీంతో రియల్టర్లుగా ఉన్న వారంతా వైసీపీ నాయకులు కావటంతో మాజీ ఎమ్మెల్యేపై గుర్రుగా ఉన్నారు. వైసీపీలో ఈ వ్యవహారం రాజకీయ చిచ్చు మొదలైంది.



వెంగాయగారిపాలెం- తుమ్మలపెంట రోడ్డు మధ్యలో అనధికార లేఅవుట్

• కొనుగోలుదారుల్లో ఆందోళన

లేఅవుట్లలో సరిహద్దు రాళ్లు, రోడ్లు, కాలువలు చెరిపేస్తుండటంతో ఎవరి ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్లాట్ల కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. అనధికార లేఅవుట్ల కావటంతో వాటిని అధికారికంగా గుర్తించేందుకు ఎలాంటి అవకాశాలు లేవు. లేఅవుట్ మ్యాప్‌లన్నీ లేఅవుట్‌దారులు సొంతంగా తయారు చేసుకున్నవి కావటంతో సరిహద్దు రాళ్లు పోతే ఆ తర్వాత ఎవరి ప్లాటు ఎక్కడుంటుందో తెలియక గొడవలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

• నాటిపాలకుల పాపమే

గత పాలకులు, అధికారులు దొంగలు.. దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా ఎవరి వాటా వారు తీసుకుని అనధికార లే అవుట్లు వేసుకునేందుకు సహకరించారు. దీంతో రియల్టర్లు అనధికార లేఅవుట్లు వేయడమేగాక వాటి పక్కన ఉన్న కాలువల, గుంటలు, వంకలు, వాగులు ఆక్రమించుకుని లేఅవుట్లలో కలిపేసుకున్నారు. ఆ లేఅవుట్లలో నిర్మాణాలకు అధికారులు అనుమతులు కూడా ఇవ్వడంతో అనేక భవనాలు వెలిశాయి. దీంతో ప్రజలు కూడా ఆ ప్లాట్లు సక్రమమేనని ఎగబడి ప్లాట్లు కొన్నారు. అదే అధికారులు ఇప్పుడు ఆ లేఅవుట్ల అక్రమమని వాటిని చెరిపేస్తుండటంతో ప్రభుత్వాలు మారినపుడల్లా చట్టాలు మారతాయా అని ప్లాట్లు కొనుగోలు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూ ఆక్రమణదారులపై
చర్య తీసుకోవాలి

- దళిత హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్ర

ఉలవపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చాకిచర్ల గ్రామంలో దళితుల సాగు భూమిని ఆక్రమించిన వ్యక్తులపై ల్యాండ్ గ్రాబింగ్ కింద కేసు నమోదు చేయాలని దళత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ విషయంపై బుధవారం ఆయన బాధిత రైతులతో తహసీల్దారు లావణ్యవేణికి వినతిపత్రం అందజేశారు. గ్రామం లోని సర్వేనెంబర్ 926-1లో 28ఎకరాల 65 సెంట్లు సోషల్ ఫారెస్టు భూమిని అన్ని కులాల రైతులు, పల్లెకారులు సాగు చేసుకో వచ్చని 20ఏళ్ల క్రితం గ్రామపెద్దలు ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు. పల్లెకారుల నివాసం కోసం వేరే సర్వే నెంబర్లులో ఇళ్ల స్థలాలు కేటాయించినా దళితుల భూములను ఆక్రమించుకొని సాగు చేసుకునెందుకు ప్రయత్నిస్తూ బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో దళిత నాయకుడు నీలం నాగేంద్ర, పుల్లా కిరణ్‌రెడ్డి, వీరమల్లు కొండయ్య, మాల మహా నాడు అధ్యక్షుడు దారా అంజయ్య, కాకు మాని రవి, చాకిచర్ల రైతులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నీలం నాగేంద్ర, బాధిత రైతులు



మహీధరరెడ్డితో భేటీ అయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి

మహీధరరెడ్డితో ఆదాల భేటీ

కందుకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ నేత, మాజీ మంత్రి మానుగుంట మహీధరరెడ్డిని బుధవారం వైసీపీ నెల్లూరు పార్లమెంటు పరిశీలకుడు, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి మాచవరం గ్రామానికి వచ్చి కలవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.గత కొంతకాలంగా మహీధరరెడ్డి వైసీపీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ స్వతంత్రంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. గత ఎన్నికల సమయంలో సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మహీధరరెడ్డిని కాదని వైసీపీ అధిష్ఠానం కనిగిరి ఎమ్మెల్యేగా ఉన్న బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కందుకూరులో పోటీకి నిలిపారు. ఎన్నికల సమయంలోనే వైసీపీతో అంటీముట్టనట్లు వ్యవహరించిన మహీధరరెడ్డి తర్వాత పార్టీకి పూర్తిగా దూరంగా ఉంటున్నారు. కందుకూరులో ఉన్న తన కార్యాలయంలో కూడా జగన్మోహనరెడ్డి, ఇతర వైసీపీ నేతల ఫొటోలను పూర్తిగా తీసివేయించి కేవలం తన ఫొటో, తన తండ్రి దివంగత ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఫొటోలను మాత్రమే ఉంచారు. ఇటీవలికాలంలో పార్టీ కార్యకలాపాల విషయంలో బుర్రా మధుసూదన్ యాదవ్‌పై క్యాడర్‌లో భరోసా సడలుతుండటం, ఆయనను తిరిగి కనిగిరికే పంపిస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. సమావేశంలో పలు అంశాలపై చర్చించుకున్నా ప్రధానంగా రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన అంశపైనే చర్చ జరిగినట్లు సమాచారం. ఆదాల వెంట నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఉన్నారు.

'పాడిపరిశ్రమ పరిశీలన' అంశంపై సదస్సు

కావలి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేబీ డిగ్రీ కళాశాలలోని ఎస్ఆర్.శంకరన్‌హాల్‌లో బుధవారం జాతీయ రంగంలో పాడిపరిశ్రమ పరిశీలన అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డెయిరీ సైన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత మల్లికార్జున రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలో పాడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. క్షీర విప్లవంతో పాడిపరిశ్రమలో నూతన పద్ధతులు అందుబాటులో వచ్చాయని వాటితో గణనీయమైన ఉత్పత్తి సాధించామన్నారు. విద్యార్థులు తరచూ డెయిరీలను సందర్శించి ప్రత్యక్ష పరిజ్ఞానాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంనాయుడు, సెల్ఫ్‌హెల్ప్ కోర్సుల డైరెక్టర్ ఆర్.మాల్యాద్రి, డెయిరీ సైన్స్ హెడ్ రమణ పాల్గొన్నారు.



ఉపన్యసిస్తున్న డాక్టర్ మల్లికార్జున రెడ్డి

ముంచుతున్న మిర్చి!

(5వ పేజీ తరువాయి)

రైతులు తలపట్టుకుంటున్నారు. దశాబ్ద కాలంలో మిర్చిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతంలో కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వెయ్యి ఎకరాల లోపు మాత్రమే సాగయ్యే మిర్చి కొన్నేళ్లుగా ఏటా సరాసరిన 4వేల ఎకరాలలో సాగవుతోంది.

• క్వింటాల్ రూ.13వేలకు..

ప్రతి ఏడాది మిరప క్వింటాల్‌కు రూ.16వేలకు తక్కువ కాకుండా అత్యధికంగా రూ.25 వేలు పలికింది. సరాసరిన రూ.19వేల వరకు లభించేది. కానీ ఈ ఏడాది క్వింటాల్ రూ.13వేలకు మించడం లేదని రైతులు వాపోతున్నారు.

• ఎకరానికి 10 క్వింటాళ్లు అనుమానమే

గతంలో సరాసరిన ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే మిరప.. ఈ ఏడాది 10 క్వింటాళ్ల దిగుబడి రావటం కూడా గగనంగా కనిపిస్తోంది. కొందరు రైతులు ఇప్పటికే తోటలను పూర్తిగా వదిలేయగా మరికొందరు తంటాలు పడుతున్నారు. వారు కూడా ఎకరానికి 10క్వింటాళ్ల దిగుబడి తీయగలుగుతారన్న నమ్మకం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నల్లి, నల్లతామర నియంత్రణ కోసం మార్కెట్లో అందుబాటులో ఉన్న అధునాతన మందులు కూడా భారీగా ధర పలుకుతుండటంతో కొందరు బ్లాక్ మార్కెట్లో మందులు కొనుగోలు చేసి పైరుకు కొడుతున్నారు. ఎకరానికి ఒకసారి స్ప్రే చేయాలంటే రూ.5వేల వరకు ఖర్చవుతోందని, తిరిగి నాల్గవరోజు స్ప్రే చేస్తే తప్ప ఫలితం లేకపోవటంతో అంత భారీ పెట్టుబడి పెట్టలేక వదిలేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో క్వింటాల్ రూ.22 వేలు ధర ఉన్నా మరింత ధరను ఆశించి అనేకమంది రైతులు మిర్చిని ఏసీ గోదాముల్లో నిల్వచేశారు. అంతకుక్రితం సీజన్‌లో సాగు చేసిన మిర్చినీ ఏసీలలో ఇప్పటికీ నిల్వచేసి ఉన్న రైతులూ ఉన్నారు. అయితే ధర పెరగకపోగా పతనమవుతోంది. ప్రస్తుతం క్వింటం రూ.13వేలకు అమ్ముకోగ చేయగలిగింది లేదు. దీంతో రెండేళ్లుగా వడ్డీలు, ఏసీ గోదాముల బాడుగలు చూసుకుంటే వారు తీవ్రంగా నష్టపోతున్నారు. కేవలం కందుకూరు ప్రాంతంలోనే ఇలా నిల్వచేసి ఉన్న మిరప 20వేల క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచనా. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటించి ఎగుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటే తప్ప అప్పుల ఊబి నుంచి బయటపడలేరని పలువురు మిర్చి రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

19 నుంచి టీసీసీ పరీక్షలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ) లోయర్, హయ్యర్ గ్రేడ్, డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడ్ పరీక్షలను ఈనెల 19 నుంచి 22 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ బాలాజీ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాండ్లూమ్ వీవింగ్ ప్రాక్టికల్స్ పరీక్షలను 19 నుంచి 28వతేదీ వరకు నిర్వహిస్తారన్నారు. టైమ్ టేబుల్, పూర్తి వివరాల కోసం www. bseap.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

వైద్య ఉద్యోగాలకు మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలోని ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో ఎన్‌హెచ్‌ఎం కింద డైస్ కేంద్రంలో ఖాళీల భర్తీకి సంబంధించి మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆడియాల జిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్ - 1, డెంటల్ టెక్నీషియన్- 1 పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. మెరిట్ జాబితాను spsnellore. ap.gov.in/notice/recruitment వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు దీన్ని పరిశీలించుకోవచ్చని తెలియచేశారు.

పీహెచ్‌సీ వైద్యుడి పనితీరుపై విచారణ

ఏఎస్ పేట, ఫిబ్ర వరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు సురేష్‌బాబు పనితీరుపై స్టాఫ్‌నర్స్ లక్ష్మి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. బ్రిజీత విచారణ చేప ట్టారు. స్టాఫ్‌నర్స్ లక్ష్మి ఆరోగ్యం బాగాలేక మూడు రోజులు సెలవు కోసం లెటర్ అందించి, 3రోజుల తరువాత విధులకు హాజ రైంది. కానీ సెలవు మంజూరు చేయకుండా విధులకు హాజరుకానం దుకు లక్ష్మికి మెమో అందించారు. దీనితో ఆమె ఉన్నత అధికారులను సంప్రదించింది. తన సెలవులతో ప్రజలు ఇబ్బందులు పడతారని సెలవు మంజూరు చేయ లేదని ఉన్నత అధికారులకు డాక్టరు వివరించారు. కాగా, కావాలనే తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనిపై విచారణ చేయాలని గ్రీవెన్స్‌లో స్టాఫ్ నర్స్ లక్ష్మి ఫిర్యాదు చేయడంతో విచారణకు విచ్చేశానని డిప్యూటి డీఎంహెచ్‌ఓ బ్రిజీత తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు ఆరుగురి గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ మొదటి, నాలుగో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 34 మంది విద్యార్థులకు గాను 28 మంది హాజరయ్యారు.

నకిలీ బంగారంతో కుదువ వ్యాపారికి బురిడీ

- రూ. 1.2 లక్షలతో ఉడాయింపు

సంగం, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కుదువ దుకాణంలో ఇద్దరు యువకులు నకిలీ బంగారు బ్రాస్‌లెట్‌తో ని ర్వాహకులను బురిడీ కొట్టించిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. ఆలస్యంగా గుర్తించిన నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. సాయంత్రం 5.30 గంట ల సమయంలో కుదువ దుకాణం వద్దకు ఇద్దరు యువకులు హడావుడిగా వచ్చి మా నాన్నకు గుండెపోటు రావడంతో వైద్యశాలలో చేర్పించాం. డబ్బు లు అవసరం.. బ్రాస్‌లెట్ కుదువ పెట్టుకుని డబ్బులు ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. పక్కనే మరో దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి వారు లోకల్ వ్యక్తులేనని చెప్పడంతో నమ్మి ఆధార్ కార్డు తీసుకుని నిర్వాహకులు బంగారం తూకం వేసి సుమారు రూ. 12 లక్షల నగదు ఇచ్చారు. కాగా, వారు వెళ్లిన కొంతసేపటికి బ్రాస్‌లెట్‌ను పరీక్షించగా వెండిపై బంగారు పూత పోసిందిగా గుర్తించారు. వెంటనే సీసీ కెమెరాలు పరిశీలించగా కొంత దూరంలో నిలిపిన కారులో పరారైనట్లు తెలిసింది. వారిచ్చిన ఆధార్‌కార్డు కూడా నకిలీ అని తేలింది. కుదువ దుకాణం మేనేజర్ రాము ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	116
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8186
వెండి కిలో ధర	రూ. 98,500
వెండి ఒక గ్రాము	రూ.101.50



కలెక్టరేట్‌కు మంచి రోజులు

- రూ.కోటితో సమస్యల పరిష్కారానికి కలెక్టర్ నిర్ణయం
- కొత్త లిఫ్టు ఏర్పాటు, రికార్డుల రూము, మరుగుదొడ్ల ఆధునికీకరణ

నెల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పేరుకేమో జిల్లా పాలనా కార్యాలయం, కానీ అక్కడ కనీస వసతులుండవు. ఆఖరుకు మరుగుదొడ్లు కూడా శుభ్రంగా ఉండవు. వర్షాకాలం వస్తే ఒకవైపు భవనం ఉరుస్తుంటుంది. మరోవైపు పెచ్చులూడుతుంటుంది. ఇక రికార్డు రూమ్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. అత్యంత విలువైన పాత రికార్డులు మొత్తం ఇక్కడే ఉన్నాయి. సరైన వసతులు లేక అవి పాడైపోతున్నాయి. ఇంత పెద్ద కలెక్టరేట్‌లో లిఫ్ట్ లేకపోవడంతో దివ్యాంగు లు, వృద్ధులు, మహిళలు పైకి ఎక్కేందుకు చాలా అవస్థలు పడుతున్నారు. వీటన్నింటినీ గమనించిన కలెక్టర్ ఓ ఆనంద్, సమస్యల పరిష్కారానికి నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం రూ.కోటికిపైగా నిధులను మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ పనులన్నింటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచి ఉన్నారు. రెండు, మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. రూ.30 లక్షలతో లిఫ్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రూ.20 లక్షలతో రికార్డు గదిని ఆధునికీకరించనున్నారు. కలెక్టరేట్ పైభాగంలో ఉరవకుండా ఉండేందుకు ఫ్లోరింగ్ చేయడం, మరుగుదొడ్లు బాగు చేయడానికి కూడా టెండర్లు పూర్తి చేశారు.

కృష్ణపట్నం ఉప్పు భూములకు పరిహారం అందేనా..!?

19 ఏళ్లుగా రైతుల ఎదురుచూపు

ముత్తుకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం నిర్వాసిత ఉప్పు రైతులకు ఇప్పటికైనా పరిహారం అందేనా అన్న సందేహం బాధితుల్లో వ్యక్తమవుతోంది. 19 ఏళ్లగా ఇదిగో వస్తోంది.. అదిగో ఇస్తారంటూ.. ప్రతి ఏటా ఉప్పు రైతులను పాలకులు, అధికారులు ఊరిస్తూనే ఉండడంతో వారు ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు.

కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి కోసం 2006లో కృష్ణపట్నం సాల్ట్ సొసైటీ పరిధిలోని గోపాలపురంలో ఉన్న 970 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే అప్పట్లో సాల్ట్ సొసైటీ ఈ భూములకు బదులుగా మరో ప్రాంతంలో ఉప్పు పండించే భూములను చూపించి రైతులకు తగిన పరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకోవాలని కోరారు. దీంతో కొంతకాలం ఉప్పు భూముల సమస్య పెండింగ్‌లో పడింది. అనంతరం ఉప్పు భూములకు ధర చెల్లించి స్వాధీనం చేసుకు నేందుకు పోర్టు యాజమాన్యం సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే పరిహారం ఇచ్చేదాకా తమ భూములను అప్పగించబోమని ఉప్పు రైతులు తేల్చి చెప్పారు. ఆ భూముల్లో ఉప్పు పండిస్తూ కొన్నేళ్లు జీవనం సాగించారు. బొగ్గు కాలుష్యం కారణంగా పండించిన ఉప్పు పాడైపోతుండడంతో రైతులకు కొంతకాలం పోర్టు యాజమాన్యం నష్టపరిహారం చెల్లిస్తూ వచ్చింది. ఆ తర్వాత మార్కెట్ ధర ప్రకారం భూముల ధర నిర్ణయించి, ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించామని, కృష్ణపట్నం పోర్టు ఉప్పు భూముల్లో తమ కార్యకలాపాలు ప్రారంభించారు. అప్పటి నుంచి భూముల పరిహారం సమస్య అపరిష్కృతంగానే ఉంది. కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం నవయుగ చేతి నుంచి అదానీ కంపెనీకి మారడంతో ఉప్పు భూముల పరిహారం విషయం కొలిక్కి వస్తోందని అంతా భావించారు. ఎన్నో ఏళ్లుగా తాము చూస్తున్న పరిహారం చేతికందుతోందను కున్నారు. అయితే అదానీ కంపెనీ యాజమాన్యం మారి ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ భూముల పరిహారం సమస్య కొలిక్కిరాలేదు. ఉప్పు రైతులకు పరిహారం చెల్లించడంతోపాటు ఉప్పు భూములపై ఆధార పడి జీవిస్తున్న వేలాదిమంది కార్మికులకు ఉపాధి కల్పిస్తామన్న పోర్టు యాజమాన్యం హామీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా ఉప్పు రైతుల సమస్యను పరిష్కరించి పరిహారం చెల్లించాలని ఉప్పు భూములపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఉపాధి కల్పించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



రైతులు కోల్పోయిన కృష్ణపట్నం ఉప్పు భూములు



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో సమావేశమైన కలెక్టర్ ఆనంద్

ప్రభుత్వ పథకాలను వేగవంతం చేయాలి

- కలెక్టర్‌కు మంత్రి ఆనం సూచన

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా చేరువయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్‌కు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మంత్రికి కలెక్టర్ వివరిం చారు. పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనులు, సోమశిల ప్రాజెక్టు సంబంధిత పనులు, ఆత్మకూరు నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై, విద్యా రంగంలో నూతన విధానాలపై చర్చిం చారు. ఈ సందర్భంగా సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి కలెక్టర్‌ను సత్కరించారు.

ఆర్‌పీఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మాబు



పాటిల్‌ను గజమాలతో సత్కరిస్తున్న మాబు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌కే మాబును నియమించామని, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ చెప్పారు. పాటిల్ పలు రాష్ట్రాల పర్యటనలో భాగంగా బుధవారం నెల్లూరుకు వచ్చారు. ఓ హోటల్‌లో పార్టీ శ్రేణులతో చర్చలు జరిపారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ స్థాపించిన ఆర్‌పీఐకి మాబును ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా నియమించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సౌత్ ఇండియా ప్రెసిడెంట్ పీ అంజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పిట్ట వరప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పండు బాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ తాగునీరు అందించండి : జడ్పీ సీఈవో విద్యారమ



అధికారులకు సూచనలు ఇస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

ఏఎస్ పేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సిపిడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా గ్రామాలకు ప్రతిరోజు తాగు నీరు అందించాలని జడ్పీసీఈఓ విద్యారమ తెలిపారు. బుధవారం ఆమె మండలంలోని కొండమీదకొం డూరు గ్రామంలో సిపిడబ్ల్యూఎస్ స్కీమ్‌ను తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రెడ్డెయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్‌రావు, ఎంపీడీవో ప్రసన్నకుమారి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవితేజ, విస్తరణ అధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

సుకుమార్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి



కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

కావలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ కావలి వైసీపీ ముఖ్య నేతలు బుధవారం జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని నెలూరులో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల సుకుమార్‌రెడ్డి కావలిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు. తమ అక్రమ లేఅవుట్లను కాపాడుకునేందుకు టీడీపీతో కుమ్మక్కై కావలి నియోజకవర్గంలో వైసీపీ నాయకుల మధ్య చిచ్చుపెడుతున్నారని విన్నవించారు. జిల్లా అధ్యక్షుడిని నియోజకవర్గంలోని ముఖ్య నాయకులంతా కలవటంతో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తెరవెనుక ఉండి పంపించాడనే ప్రచారం ఉంది.

త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

సంగం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. బుధవారం ఆమె మండలంలోని దువ్వూరు రైతు సేవా కేంద్రంలో రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండించిన ధాన్యానికి మద్దతు ధర వస్తుందా, రాదా అని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు కావలసిన తేమ యంత్రాలను కూడా సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ మిల్లర్లతో సమావేశం నిర్వహించగా పుట్టి ధాన్యం రూ. 19 వేలకు తగ్గకుండా కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలో సాగైన కెఎల్‌ఎం 1638 రకం ధాన్యానికి కర్నాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో మంచి డిమాండ్ ఉందన్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దేవిశెట్టిపల్లి గ్రామ ప్రజలు

సీతారామపురం (ఆంధ్రజ్యోతి): మారంరెడ్డిపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన ఇర్ల నాగయ్య సర్వే నెంబర్ 86-3 గల ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని, దానిని అడ్డుకోవాలని దేవిశెట్టిపల్లి గ్రామ సర్పంచి, ప్రజలు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

కావలి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తుమ్మల పెంట పంచాయతీ చినరాముడు పాలెంలోని కోడి పందేల స్థావరంపై బుధవారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో పందేలు నిర్వహిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసులకుని వారి వద్ద నుండి రూ.3,200 నగదు, ఒక కోడి పుంజు స్వాధీనం చేసుకు న్నట్లు ఎస్‌ఐ తిరుమల రెడ్డి తెలిపారు.

మూడు పొగాకు బ్యారన్ల దగ్ధం

- రూ.12 లక్షల మేర ఆస్తి నష్టం



ప్రమాదంలో దగ్ధం అవుతున్న బ్యారన్

కలిగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణారెడ్డి పాలెంలో బుధవారం వేకువ జామున జరిగిన అగ్ని ప్రమాదంలో పల్లపోలు కాంతమ్మ, చాగంటి ధనమ్మ, దండా శాంతమ్మలకు చెందిన మూడు బ్యారన్లల దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.12లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. మూడుబ్యారన్‌లో క్యూరింగ్ చివరిదశలో ఉన్నపుడు పొగాకు అల్లిక కర్ర గొట్టాలపై పడటంతో మంటలు చెలరేగాయని చెప్పారు. ప్రమాదంలో పొగాకు, అల్లుడుకర్ర, టైర్లు, గొట్టాలు పూర్తిగా తగులబడిపోయినట్లు చెప్పారు. వింజమూరు నుంచి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకున్న పొగాకు బోర్డు అధికారులు వచ్చి వివరాలు సేకరించారు.

కోనేరులో యువకుడి గల్లంతు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టీపీగూడూరు మండలం నరుకూరు ఎస్టీ కాలనీకి చెందిన ఈగ కృష్ణ (25) సమీప బంధువులతో కలిసి బుధవారం మద్యం మానేయాలని దండ వేసుకునేందుకు బుధవారం గంగపట్నం శ్రీచాముండేశ్వరి ఆలయానికి వచ్చారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న కృష్ణ కోనేరులో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన వ్యక్తి కోసం గజ ఈతగాళ్ల సాయంతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా మృతదేహం ఆచూకీ లభించ లేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గంగాధర్

మర్రిపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవాలయాలలో ఇటీవల వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇటీవల పొంగూరు పోలేరమ్మ దేవాలయం, నందవరం శివాలయంలో దొంగతనాలకు పాల్పడిన దాసరి పోలయ్య, షేక్ లాల్‌బాషాను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 8000 నగదు, ఒక మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచామన్నారు. గతంలో పోలయ్య 9 కేసుల్లో ముద్దాయి కాగా, లాల్‌బాషా 6కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు ఎస్‌ఐ వివరించారు.

స్కూటర్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు

- ప్రశ్నించిన స్కూటరిస్టుపై డ్రైవర్, క్లీనరు దాడి

బుచ్చిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జొన్నవాడ సెంటర్ బైపాస్‌రోడ్డులోని అపార్టుమెంటు మలుపు వద్ద బుధవారం సాయంత్రం ఓ ప్రైవేటు స్కూలు బస్సు ముందు వెళ్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ వెళుతున్న కోవూరు రత్నం గాయపడ్డారు. ఇదేమిటని బస్సు డ్రైవర్‌ను ప్రశ్నించడంతో అతన్నే తిరిగి క్లీనర్‌తో కలిసి చితకబాదారు. సంఘటన సమయంలో అక్కడే ఉన్న స్థానికులు మాత్రం బస్సు డ్రైవరు, క్లీనర్లను మందలించారు. సమాచారంతో ఎస్‌ఐ అక్కడికి చేరుకోవడంతో సర్దుమణిగింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మద్యం మత్తులో విధులకు డుమ్మా

- హెల్త్ ఎడ్యుకేటర్ తీరుపై ప్రజల విమర్శలు



మద్యం మత్తులో ఉన్న హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు

వింజమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెల్త్ ఎడ్యుకేటర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లు పూటుగా మద్యం సేవించి విధులకు డుమ్మా కొడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. లక్ష రూపాయలు జీతం తీసుకుంటూ మద్యం సేవించి తిరగడం ఎంతవరకు సమంజసమని, పలుమార్లు ఇదేవిధంగా ఉన్నా మండల వైద్యాధికారి చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లనే ఇలా జరుగుతోందని విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయ పడిన సంఘటన మండలంలోని కంటేపల్లి సమీపంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... నెల్లూరు నగరంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు బైక్‌పై దైవదర్శనం కోసం గొలగమూడికి వచ్చి తిరిగి వెళ్తుం డగా కంటేపల్లి దాటిన తర్వాత మలుపు వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా ఎదురుగా ఆటో రావడంతో అదుపుతప్పి బైక్ బోల్తాపడింది. ఈప్రమాదంలో ఇద్దరూ గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమనతిప్పలో పోలీసుల కార్డెన్ సెర్చ్

- 40 మోటారు బైక్‌లు, 6 ఆటోల స్వాధీనం
- డీఎస్పీ వేణుగోపాల్



కార్డెన్ సెర్చ్‌లో పట్టుబడిన మోటారు బైక్‌లు

సంగం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తిరుమనతిప్ప ఎస్టీ కాలనీలో ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సంగం, ఆత్మకూరు సీఐలు వేమారెడ్డి, గంగాధర్‌లు బుధవారం తెల్లవారుజాము 5 గంటలకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటినీ తనిఖీ చేసి సరైన పత్రాలులేని 40 మోటారు బైక్‌లు, 6 ఆటోలు సీజ్‌చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వేణుగోపాల్ మాట్లాడుతూ తిరుమనతిప్పలో కొత్త వ్యక్తులు అద్దె ఇళ్లలో ఉంటూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించిన పత్రాలు చూపిస్తే విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు వేమారెడ్డి, గంగాధర్, సంగం, చేజర్ల, అనంతసాగరం, మర్రిపాడు ఎస్‌ఐలు రాజేష్, తిరుమల రావు, సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.

తరగతులను తొలగించొద్దని తల్లిదండ్రుల ఆందోళన



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ 17వ వార్డు నాగులపాడు ప్రాథమిక పాఠశాలలోని తరగతులను తొలగించొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. నాగులపాడు పాఠశాలలోని 3, 4, 5 తరగతులను చెర్లో యడవల్లి పాఠశాలలో కలిపి మోడల్ పాఠశాలను ఏర్పాటు చేయనున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ తల్లిదండ్రులు ఆందోళన చేశారు. నాగులపాడు పాఠశాలలో యథావిధిగా తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంఈవోకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ నేత వెంకటయ్య మృతి తీరని లోటు : కాకర్ల



వెంకటయ్య చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

సీతారామపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ సొసైటీ అధ్యక్షుడు, తెలుగుదేశంపార్టీ నాయకుడు వెంగళశెట్టి వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్, వారి సోదరులు కాకర్ల వెంకట్, కాకర్ల సునీల్ తెలిపారు. బుధవారం వెంకటయ్య స్వగ్రామం సంగసానిపల్లికి విచ్చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగలశెట్టి వెంకటేశ్వర్లు, పిడుగు రమేష్, ఎడమ ప్రవీణ్, తిరుపతయ్య, షేక్ బాబు, మనోజ్‌బాబు,సింగాల నాగేశ్వరరావు, మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నిత్యావసరాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

కావలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మి కులకు బుధవారం స్థానిక కార్యాలయ ఆవరణలో సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు పంపిణీ చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెలా జీతాలు అందచేస్తున్నట్లు తెలిపారు. దినసరి కార్మికులకు కూడా రెండునెలలకోసారి జీతాలు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోవాలాలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ఉదయగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆటోవాలాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే ఆటోలు నిలపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ ప్రతిఒక్కరూ లైసెన్సు కలిగి ఉండి యూనిఫాం ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాల పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల విద్యాబోధన విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉండాలని ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసనా, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే ఎంఈవో-2 శ్రీనివాసులు మండలంలోని వెంగళరావునగర్ మెయిన్, ఉర్దూ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి విద్యార్థుల, ఉపాధ్యాయుల రిజిస్టర్లను పరిశీలించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

బిట్రగుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భం గా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ అధ్యాపకురాలు లక్ష్మీ పాల్గొని క్యాన్సర్ వ్యాధి ఎలా వస్తుందో వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

స్వచ్ఛత యంత్రాలకు తుప్పు

- వాడకుండానే మూలకు..
- రూ. కోట్ల ప్రజాధనం వృథా



కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్రెడ్డర్ యంత్రాలు



సచివాలయంలో నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రం

ఉదయగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛతకు కొనుగోలు చేసిన యంత్రాలు వినియోగంలో లేక తుప్పు పట్టిపోతున్నాయి. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామాల్లో ఇంటింటా సేకరించే వ్యర్థాల నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేసి ముక్కలు చేసి ముద్దగా చేసే యంత్రాలు (స్రెడ్డర్) కొనుగోలు చేశారు. ఒక్కోదానికి సుమారు రూ2 లక్షలు వెచ్చించారు. వాటిని జిల్లాలోని అన్ని మేజర్ పంచాయతీలకు అందజేశారు. ఆయా పరికరాలను నడిపే సిబ్బందిని నియమించకపోవడంతో అవి మూలకు చేరాయి. పంపిణీచేసిన ఫాగింగ్ యంత్రాలను కొన్ని పంచాయతీలు ఒక్కరోజు కూడా వినియోగించిన పాపాన పోలేదు. కొన్ని యంత్రాలను అరకొరగా వినియోగించిన వెంటనే మరమ్మతులకు గురికావడంతో వాటిని మరమ్మతులు చేయించేందుకు క్రాంటాక్టర్ స్పందించకపోవడంతో అటకెక్కాయి. దీంతో కోట్ల రూపాయల నిధులు వృథా అయ్యాయి. ఉదయగిరి మేజర్ పంచాయతీకి అందజేసిన యంత్రాలు గత నాలుగేళ్లగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి యంత్రాలను వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కంది సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కందుకూరు: కంది పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కందుకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కంది పైరులో పిండినల్లి, గూడుపురుగు ఉన్నట్లు గుర్తించామని రైతులు తక్షణం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఏఓ గీతాప్రకాష్ సూచించారు. బుధవారం జీ.మేకపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ అనసూయతో కలిసి కందిపైరును పరిశీలించారు. పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రోశిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

● దుత్తలూరు(ఉదయగిరి) : శనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ డీ విజయకుమార్‌నాయక్, డీఆర్సీ ఏవో గీతాకుమారి సూచించారు. బుధవారం మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆహార, పోషణ భద్రతా పథకం కింద లక్ష్మీపురం గ్రామంలో సాగులో ఉన్న శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగులో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందాలన్నారు. శనగ పంట విత్తన శుద్ధి, విత్తన మోతాదు ప్రతి రైతు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.వెంకటసుబ్బారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: శనగ పంట లో సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ తెలిపారు. కళవళ్లలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శనగపంటను పరిశీలించి రైతులకు తగు సలహాలు అందించారు. శనగపంటలో వేరుకుళ్ల తెగులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రబీసీజన్లో సాగు చేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి



సీతారామపురం: సంపద తయారీ కేంద్రం వద్ద పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న డీఎల్‌పీవో ఆదినారాయణ

ఉదయగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీలోపు పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు వినియోగంలోకి తీసుకురావాలని ఆత్మకూరు డీఎల్‌పీవో దాసరి నారాయణరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి వాటి నిర్వహణపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి చివరి నాటికి పంచాయతీల్లో ఇంటి, కొళాయి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా మంచినీటి పథకాలు సమగ్రంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరీముల్లా, నాగూర్‌బీ, హీనా, జ్యోత్స్న, భవాని, శేఖర్, తేజ, అంజనేయులు, వీరేంద్ర, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

●సీతారామపురం : మండల కేంద్రమైన సీతారామపురం గ్రామ పంచాయతీ రికార్డులను డిఎల్‌పిఓ ఆదినారాయణ బుధవారం పరిశీలించారు. అనంతరం పంచాయతీలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఓ ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన పొడి, తడి చెత్తను వేరు చేసి వర్మికంపోస్ట్ తయారుచేయాలని తెలిపారు. సంపద తయారీ కేంద్రం వద్ద మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి వారికి సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, ఈవోపీఆర్డీ భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కావలి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిట్స్ పోటీలకు స్థానిక నలంద ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థుల ప్రాజెక్ట్ ఎంపిక కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. బుధవారం పాఠశాల డైరెక్టర్ ఎండీ.వశీం విద్యార్థులు బీవీఎస్. మోక్ష, జె. భారతిలను అభినందించారు.

వైసీపీ నేతకు నివాళి

లింగసముద్రం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ నాయకుడు కిలారి సుబ్బరాయుడు చిత్రపటానికి బుధారం మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వరికూటి కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, మధుసూదనరావు, చీమల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీపీడబ్ల్యూఎస్ పథకం పునరుద్ధరణకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

ఆత్మకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో జడ్పీ సీఈవో ఎం విద్యారమ బుధవారం పర్యటించారు. మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో మండలంలోని 14 గ్రామీలకు తాగునీటి సరఫరా చేయవలసిన సీపీడబ్ల్యూఎస్ పథకం మరమ్మతులకు గురి కావడంతో పరిశీలించారు. పునరుద్ధరించేందుందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి తగు సూచనలు చేశారు. ఈనెల 9వ తేదీన ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రిచే శంకుస్థాపన చేయనున్న పంచాయతీ రాజ్ అతిథిగృహ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జడ్పీసీఈవోను శాలువాతో సత్కరించారు. అనంతరం కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో వివిధ పథకాలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఎస్‌డబ్లుపీసీ కేంద్రాలను అన్ని గ్రామ పంచాయతీలలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో రమణయ్య ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్‌రావు, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఈవోపీఆర్డీ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టిన ఎమ్పీడీవో, ఎస్ఐ

కావలి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అన్నగారిపాలెంలో ఆక్రమణలకు గురైన పాఠ శాల, శ్మశానవాటిక స్థలాల ఆక్రమణలను బుధవారం ఎమ్పీడీవో శ్రీదేవి పరిశీలించి వాటి లోని తొలగించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. 40ఏళ్ల కిందట అప్పట్లో పాఠశాల స్థలం గా ఉన్న 15సెంట్ల భూమిని ఆక్రమించుకుని పశువుల మేత సాగుచేస్తున్నారన్న ఫిర్యాదులు అందాయి. అలాగే అదేగ్రామంలోని బలిజపాలెంలో 50సెంట్ల శ్మశానవాటిక స్థలం ఉన్నది. ఆక్రమణలను తొలగించి ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి, ఇన్‌చార్జీ ఈవోపీఆర్డీ అబ్దుల్ సమద్, వీఆర్వో రమణయ్య, కార్యదర్శి రామ్‌కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఉదయగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాల కోసం అర్హులైన వారు ఈనెల 7వ తేదీ లోపు ఓబీఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అప్పాజీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8 నుంచి 11 వరకు దరఖాస్తుల పరిశీలన, 12 నుంచి 14 వరకు మండల, బ్యాంక్ అధికారులు క్షేత్ర పరిశీలన చేసి లబ్ధిదారుల ఎంపిక, 17 నుంచి 20 వరకు బ్యాంకర్లు ఇచ్చిన లబ్ధిదారుల జాబితా మంజూరుకు జిల్లా అధికారులకు నివేదించడం, 21 నుంచి 23 వరకు జిల్లా కలెక్టర్ మంజూరు పంపుతారన్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ మరియు కాపు కులాల్లో అర్హులైన లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ●అల్లూరు : ప్రభుత్వం కల్పించే సబ్సిడీ రుణాలకు అర్హులైన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక నగర పంచాయతీ కమిషనరు ఉమా మహేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 30నుంచి ఫిబ్రవరి 7వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీసీ, ఈడబ్ల్యూయస్, కాపు కార్పొరేషన్లలో సంబంధిత కులాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఏపీఓబిఎం ఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి



సుబ్బారావును పరామర్శిస్తున్న యాదవ జేఏసీ నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈతముక్కలమ్మ ఆలయం వద్ద గత నెల 29న యాదవ యువకుడు అమ్మనబోయిన సుబ్బారావుపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఏకాంబరం మస్తాన్‌పై కేసు నమోదు చేయాలని యాదవ జేఏసీ అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణయాదవ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న అమ్మనబోయిన సుబ్బారావును పరామర్శించారు. మస్తాన్ దాడితో తీవ్ర మనస్తాపం చెందిన సుబ్బారావు పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల తీరుపై సీపీఐ నేతల ఆగ్రహం



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనియంపాడు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్లను నరికి యధేచ్ఛగా తరలిస్తున్నప్పటికీ అధికారులు స్పందించక పోవడం దారుణమని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి దామా అంకయ్య, సంస్థ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆ భూములను పరిశీలించి మాట్లాడుతూ వారం రోజుల్లోపు చర్యలు చేపట్టి లారీలను సీజ్ చేయాలన్నారు. అనంతరం తహసీల్దారు హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకరయ్య, మాల్యాద్రి, ఉపాధ్యక్షులు కృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పోస్టు కార్డులతో ప్రధానికి ధన్యవాదాలు



పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ కేటాయింపులపై స్థానిక బీజేపీ నాయకులు యువమోర్చ ఆధ్వర్యంలో పోస్టుకార్డులతో ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మంద కిరణ్ మాట్లాడారు. ఆదాయపు పన్ను రూ.12లక్షల వరకు మినహాయింపు కల్పించడం, విమానాశ్రయాల అభివృద్ధికి నిధులు కేటాయించడం, చిన్నతరహా పరిశ్రమలకు రూ.5- 10కోట్ల వరకు రుణపరిమితి పెంచడం, వ్యవసాయానికి పెద్దపీట వేయడం, రైల్వేలకు పెద్దఎత్తున నిధులు కేటాయించడం శుభ సూచకం అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బ్రహ్మానందం, సవీంద్ర, మురళీకృష్ణ, తిరుపతి స్వామి, రాకేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల ప్రాముఖ్యతపై అవగాహన

కొండాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరంలో ఏర్పాటు చేయనున్న ప్రైమరీ ఆదర్శ పాఠశాలలు, ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ పాఠశాలల ప్రాముఖ్యతపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని మండల ఎంఈవో 1- 2లు రవికుమార్, ఆనందరావులు బుధవారం క్లస్టర్ల పరిధిలోని హెచ్ఎంలకు అవగాహన కల్పించారు. వీలైనంత త్వరలో సమావేశం ఏర్పాటు చేసి విధానాలను పూర్తిస్థాయిలో తెలియజేయాలన్నారు.

నృత్య ప్రదర్శనకు ప్రశంసలు

కావలి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భీమవరంలోని మాముళ్లమ్మ తల్లి అమ్మవారి ఆలయ మహోత్సవాల్లో భాగంగా కావలి జయం కూచిపూడి నృత్యాలయంకు చెందిన చిన్నారులు భావన, ఆరాధ్య, నిఖిత, సమన్విత, ప్రణమ్య, మాన్వి, సంహిత, శ్రీదేవిప్నలు చేసిన నృత్య పదర్శన ఉత్తమంగా నిలిచినట్లు నృత్యాలయ నిర్వాహకురాలు జమున తెలిపారు. ఈ సందర్భంగా నృత్య గురువు జాహ్నవితో పాటు చిన్నారులను భీమవరం కళాప్రముఖులు, ఆయల ఈవో, చైర్మన్‌ల ప్రశంశలు అందుకున్నట్లు జమున తెలిపారు.

రాళ్లపాడు రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

లింగసముద్రం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పెంట్రాల పంచాయతీ శాగంవారిపాలెం అడ్డరోడ్డు వద్ద ఈ నెల 2న మోటారు సైకిల్, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు బుధవారం మండల ఎస్ఐ షేక్ మహబూబ్ సుబానీ తెలిపారు. పాస్టర్ ఎఫ్రాయిమ్ బావమరిది రేవు సుబ్బారావు ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

రైతులకు ఎలుకల నివారణ మందుల పంపిణీ

అనంతసాగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో ఎలుకల నివారణకు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందిస్తున్నట్లు ఆత్మకూరు ఏడీ దేవసేనమ్మ తెలిపారు. బుధవారం అనంతసాగరం సచివాలయం1లో రైతులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జబర్దస్త్ నటుడు శాంతి స్వరూప్ సందడి

కావలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జబర్దస్త్ నటుడు శాంతి స్వరూప్ బుధవారం పట్టణ పోలీస్ సర్కిల్ కార్యాలయం, అన్నా క్యాంటీన్‌లకు వెళ్లి కొంతసేపు సందడి చేశారు. బోగోలు మండలానికి చెందిన శాంతి స్వరూప్ సొంత పనుల మీద స్వగ్రామం వచ్చి సీఐ పాపారావును మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్, రెండో పట్టణ సీఐ గిరిబాబులు అక్కడకు చేరుకుని ఆయనతో కొంతసేపు ముచ్చటించి శాలువతో సత్కరించారు. అన్నా క్యాంటీన్‌కు వెళ్లి జనాలకు భోజనం వడ్డించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు.

ప్రధాన రహదారిలో పిచ్చి మొక్కలు తొలగించాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలోని ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏపుగా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కల మధ్య ఆ స్తంభాలు చిక్కుకుపోవడంతో నిరంతరం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. జోరుగా గాలి వీచిన సమయంలో నిప్పు రవ్వలు ఎగిసి పడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆ సమయంలో నివాసాల్లోని విద్యుత్ సామగ్రి సైతం పాడవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్ వేడుకల్లో వీఎస్‌యూకి వన్నె తెచ్చేలా ఫుడ్ టెక్నాలజీ విద్యార్థిని ప్రదర్శన చేయడం అభినందనీయమని వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు కొనియాడారు. స్థానిక వీఎస్‌యూలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని ఎల్ తేజస్వి, వేడుకలను వీక్షించేందుకు వెళ్లిన ఎం షాలిని, బీ యుగంధర్‌లను వీసీ అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కావలి పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ టీ వీరారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బీవీ సుబ్బారెడ్డి, ఎస్‌బీ సాయినాథ్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : గిరిధర్‌రెడ్డి


గ్రామస్థులతో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన గ్రామాలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆమంచర్ల గ్రామ పంచాయతీ అప్పయ్యకండ్రిక, సిద్దవరప్పాడు గ్రామాల్లో ఆయన గడప గడప కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పేద లు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయా ల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. నియోజక వర్గంలోని ప్రతీ గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు కచ్చితంగా ఉండాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు.

3వ నెంబర్‌ని మర్చిపోయారు!

- వేదాయపాళెం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై పిచ్చిమొక్కలు
- ప్రయాణికుల అసౌకర్యం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేదాయపాళెం రైల్వేస్టేషన్‌పరిసరాలు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా ఇటీవల నిర్మించిన మూడో నెంబరు ప్లాట్‌ఫాం పిచ్చిచెట్లతో నిండిపోయింది. ఈ రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. మొత్తం మూడు ప్లాట్‌ఫామ్స్ ఉండగా 1, 2 ప్లాట్‌ఫాంలు కాస్త శుభ్రంగానే ఉన్నాయి. మూడవ నెంబర్ ప్లాట్‌ఫామ్ నిర్వహణను మాత్రం గాలికి వదిలేశారు. దీంతో పిచ్చి మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి పోయాయి. ప్యాసింజర్ రైళ్లు మొత్తం మూడవ నెంబర్‌పై నిలుపుతున్నారు. దీంతో వందలాది మంది ప్రయాణికులు నిత్యం ఈ ప్లాట్‌ఫామ్‌పైకి రావాల్సి ఉంది. అయినా రైల్వే అధికారాలు మాత్రం పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. రాత్రి వేళల్లో ప్రయాణికులు ఈ పిచ్చిచెట్లలో నుంచి రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ లోపంతో ప్లాట్‌ఫామ్ మీదనున్న టైల్స్ కూడా దెబ్బతింటున్నాయి. వీటికితోడు ఈ స్టేషన్‌లో దీపాలు సక్రమంగా వెలగడం లేదు. పలు కొళాయిల్లో తాగునీరు రావడం లేదు. ప్రయాణికులు కూర్చునే బల్లలు సైతం పలుచోట్ల దెబ్బతిని ఉన్నాయి. సంబంధిత అధికారులు సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



3వ నెంబరు ప్లాట్‌ఫాం మెట్ల దారిని కమ్మేసిన పిచ్చి మొక్కలు, వాటిలో నడిచి వస్తున్న ప్రయాణికులు


ప్లాట్‌ఫాంపై పూర్తిగా టైల్స్ వేయకపోవడంతో ఏపుగా పెరిగిన గడ్డి


విరిగిన బల్ల

వీలైనంత త్వరగా తొలగిస్తాం

స్టేషన్‌లోని మూడవ నెంబర్ ప్లాట్‌ఫాంపై పిచ్చిచెట్లు పెరిగిపోయాయి. ఇప్పటికే సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాను. చాలా కాలంగా వాటిని అలాగే వదిలేశారు. స్టేషన్‌లో అవసరమైన చోట్ల దీపాలు ఏర్పాటు చేస్తాము. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెడతాము. వీలైనంత త్వరగా పిచ్చిచెట్లు తొలగించేలా చర్యలు చేపడతాము.

- డీ మునిబాబు, స్టేషన్ సూపరింటెండెంట్

విస్తృతంగా వాహనాల తనిఖీ

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సం తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ దశరథరామయ్య ఆధ్వర్యంలో బుధవారం పోలీసు లు విస్తృతంగా వాహనాల తని ఖీ నిర్వహించారు. రంగనాయ కులపేట రైల్వే గేటు, సంతపేట సెంటర్, నర్తకి సెంటర్, ముల మూడి బస్టాండు తదితర ప్రాం తాల్లో వాహనాలను తనిఖీ చేశా రు. నిబంధనలు పాటించని వా రికి జరిమానా విధించారు. ఇన్ స్పెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు నిబం ధనలు పాటించాలని, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని సూచించారు.

మైనార్టీ గురుకులం ఏర్పాటు చేయండి : ఆవాజ్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని అవాజ్ కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ నాయకులు కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు. కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మోడల్ స్కూళ్లలో ఉర్దూ మీడియంను విలీనం చేయవద్దన్నారు. ప్రతి మోడల్ పాఠశాలలో ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. అక్కచెరువు పాడులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలకు రోడ్డు వేయించాలని విజ్ఞప్తి చేశారు. భారతరత్న డాక్టర్ జాకీర్ హుస్సేన్ జయంతి, వర్ధంతి ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అవాజ్ నేతలు షేక్ రియాజ్, షేక్ అన్వర్ పాల్గొన్నారు.

కోవూరులో విద్యాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి, నాయకులు, అధికారులు

కోవూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పడుగుపాడు డిగ్రీ కళాశాలలో రూ.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించి మాట్లాడారు. వైకేఆర్ అండ్ ఆర్ కళాశాలలో అదనపు తరగతి గదులు, ఆడిటోరియం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు పెంచే విద్యాబోధన చేయాలని అధ్యాపకులనను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, తహసీల్దారు నిర్మలానంద బాబా, ఎంపీపీ తుమ్మల పార్వతి, జడ్పీటీసీ శ్రీలత, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసూన, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

- కోవూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేసి, వైద్యులకు పలు సూచనలు చేశారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమీక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మార్చురీలో ఫ్రీజర్, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థానంలో రూ.5కోట్లతో నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ సమావేశంలో కోవూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ వెంకటచలపతి, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- రైతులు పండించిన ప్రతి వడ్ల గింజ ప్రభుత్వం కొనేలా అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. నగరంలోని తన నివాసంలో రెవెన్యూ, అగ్రికల్చర్, సివిల్ సప్లై, కో ఆపరేటివ్ శాఖలకు చెందిన అధికారులతో ఆమె సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో ఈసారి 1.80 లక్షల పుట్ల ధాన్యం దిగుబడి వస్తుందన్నారు. అధికారులు చొరవ తీసుకుని అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలన్నారు.

'లక్షల డప్పులు.. వేల గొంతులు' వాయిదా

రాపూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న చేపట్టాల్సిన లక్షల డప్పులు, వేల గొంతులు భారీ ప్రదర్శన కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రకటించారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణా ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపినందున దానిలో లోపాలను సవరించాల్సిందిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నందున ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బుచ్చిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 132కేవీ ఎస్‌టీఎస్‌లో ఆధునీకరణ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పట్టణంతోపాటు బుచ్చి సబ్‌స్టేషన్, పురందరపురం, దామరమడుగు, రేబాల సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ సీహెచ్.సతీష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ వినియోగదారులకు 3ఫేస్ సరఫరా ఉదయం 6నుంచి 9గంటల వరకు, మిగిలిన విద్యుత్ సరఫరా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిగత రుణాలకు దరఖాస్తు చేసుకోండి

మనుబోలు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు ప్రభుత్వం అందించే వ్యక్తిగత రుణాల కోసం ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జలజాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 43 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఆధార్, కుల, ఆదాయ, విద్యా ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు పత్రానికి జతచేసి దగ్గర్లో ఉన్న సచివాలయంలో గాని, మీసేవా కేంద్రంలో గాని దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

టీడీపీ నేతకు నివాళి

వెంకటాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడిపర్తి గ్రామానికి చెందిన సాగునీటి సంఘం అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నేత జానా శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బుధవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పూడిపర్తిలోని శ్రీనివాసులు స్వగృహానికి చేరుకుని శ్రీనివాసులు చిత్రపటానికి నివాళ్లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పశు వైద్య శిబిరం

వెంకటాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిక్కవరప్పాడులో బుధవారం పశుసంవర్ధక శాఖ, స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెంకటాచలం పశువైద్యాధికారి డాక్టర్ కే వెంకటేశ్వర్లు, మండవ ఫౌండేషన్ పశు వైద్యాధికారి డాక్టర్ వీ శ్రీనివాసులు నాయుడు పశువులు, గేదెలకు వైద్యపరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు పోతురాజు, శ్రావణ్‌కుమార్, మనోజ్, పాడిరైతులు పాల్గొన్నారు.

వైస్‌చైర్మన్ నస్రీన్‌కు సన్మానం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ 8వ వార్డు కౌన్సిలర్ పఠాన్ నస్రీన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా బుధవారం స్థానిక నాలుగో సచివాలయం అధికారులు, సిబ్బంది శాలువా, పూలమాలతో సత్కరించి సన్మానించి అభినందనలు తెలిపారు.

తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట, జంగంవారిదొరువులో బుధవారం మండల వ్యవసాయాధికారి డీ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట వివ రాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వీహెచ్‌ఏ దీక్షిత, వీపీఏ తిరుమల్ రావు పాల్గొన్నారు.

ఇడిమేపల్లి, ఈదగాలిలో 'పొలం పిలుస్తోంది'

వెంకటాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇడిమేపల్లి, ఈదగాలి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంట సాగులో మెలకువలు, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులను అధికారులు వివరించారు. ఏడీ శ్రీనివాసులు, ఏవో హరికరుణాకర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు రవీ, లక్ష్మీ నరసింహ, రైతులు పాల్గొన్నారు.

హనుమపై వేంకటేశ్వరుడి విహారం



పొదలకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్ గేట్ సెంటర్ సమీప అయ్యప్పనగర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 4వ రోజైన బుధవారం హనుమంత వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. రాత్రి గరుడ వాహనంపై వైకుంఠనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు అల్లూరు రమణయ్య, పాలక మండలి సభ్యులు, ఉభయకర్తల పర్యవేక్షించారు.

రిటైర్డు హెచ్‌ఎం నేత్రదానం



విడవలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు హెచ్‌ఎం రామకృష్ణయ్య (97) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన విడవలూరు, ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహించారు. మరణాంతరం నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మన సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ వేణు సేకరించారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో భవానీ, అధికారులు, పోలీసులు

రాపూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్ధవరం గ్రామంలో దారి మార్గం ఆక్రమణకు గురికావడంతో అదే గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి అనే వ్యక్తి ప్రజా సమస్యల వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాపూరు రెవెన్యూ అధికారి లక్ష్మీనరసింహం, ఎంపీడీవో భవానీలు ఆ స్థలాన్ని పరిశీలించి జేసీబీ, ట్రాక్టర్ సాయంతో ఆక్రమణలు బుధవారం తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ వెంకటరాజేష్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లేటి కాలువ అక్రమణపై సర్వే

విడవలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముదివర్తి రెవెన్యూ పరిధిలోని ఎల్లేటి కాలువ ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. సుమారు 300 ఎకరాలకు ఉపయోగకంగా ఉండే ఈ కాలువను కొందరు ఆక్రమించుకుని పెద్ద నిర్మాణం చేపట్టడంతో పలువురు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఎల్లేటి కాలువ ఆక్రమణ కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టరు ఆనంద్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దారు చంద్రశేఖర్ సూచనలతో మండల సర్వేయర్ మస్తాన్‌భాష, వీఆర్వో దుర్గాప్రసాద్, విలేజ్ సర్వేయర్ ప్రసన్న కుమార్‌లు కాలువ ఆక్రమణలపై సర్వే చేశారు. కాలువ ఎంత ఉండాలి ఎంత అక్రమణకు గురైందని కొలతలు వేసి గుర్తులు నాటారు. కాలువని పూర్తిస్థాయిలో సర్వేచేసిన పిదప ఉన్నతాధికారులకు నివేధిక సమర్పించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చంద్రశేఖర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'శంభన్‌రెడ్డిలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి'


ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

విడవలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శంభన్‌రెడ్డిలను ఎస్సీ కులగణన జాబితా తక్షణమే తొలగించాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు, హైకోర్టు న్యాయవాది కలిచేటి వెంకట్రావుల ఆధ్వర్యంలో దళితులు బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది వెంకట్రావు, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్లు సాల్మన్ రాజు, గంగపట్నం సతీష్, ముసలి నవీన్, దర్గిగుంట వాసు, గాలి వేణుగోపాల్, కర్ర మల్లికార్జున్ పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోండి

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తపాలా శాఖలో తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు డివిజన్ హెడ్ క్వార్టర్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్‌ఆర్‌కెహెచ్ ప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరు ఈస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సోంపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం తోటపల్లిగూడూరు, ఉప తపాలా కార్యాలయంలో గ్రామీణ పోస్టల్ ఉద్యోగులతో ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ స్థాయి గ్రామీణ తపాలా ఉద్యోగులు పోస్టల్ సేవలను గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తోటపల్లిగూడూరు, బ్రహ్మదేవం సబ్ పోస్టమాస్టర్లు ఎం కృష్ణారావు, వై రాంబాబు, సీహెచ్ వెంకయ్య, జీడీఎస్. స్టాఫ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలు జగన్‌ను నమ్మే స్థితిలో లేరు

సర్వేపల్లి ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డి


నగర వనాన్ని పరిశీలిస్తున్న సోమిరెడ్డి, కోటంరెడ్డి అధికారులు

వెంకటాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలెవరూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మే స్థితిలో లేరని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వెంకటాచలం సమీపంలో నిర్మిస్తున్న నగర వనాన్ని బుధవారం సాయంత్రం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. తొలుత అడవిలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగరవనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీని మునిగిపోకుండా చూసుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకం లేకనే ఏ2 విజయ సాయిరెడ్డి సైతం విడిచిపెట్టేశాడని విమర్శించారు. 125 ఎకరాల్లో జాతీయ రహదా రికి అనుకొని నిర్మిస్తున్న నగరవనాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతామని అన్నారు. నగర వనానికి అటవీ శాఖ రూ.2 కోట్లు పెట్టి నిర్మిస్తుందని, మరో రూ.4 కోట్లను నుడా, డ్వామాలు ప్రకటించాయని సోమిరెడ్డి చెప్పారు. వెంకటాచలం సమీపంలో నిర్మిస్తున్న నగరవనాన్ని రాష్ట్రంలోనే నెంబరు వన్‌గా తీర్చిదిద్దుతామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. రూ.2 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పలువురు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నోట్లు లెక్కపెట్టందే కాకాణికి నిద్ర పట్టదు

ముత్తుకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రోజూ నోట్లు లెక్కపెట్టందే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నిద్ర రాదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. వల్లూరులో బుధవారం ఆయన పశు వైద్యాశాల నూతన భవనాన్ని, సిమెంటు రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ తనను తిట్టడమే కాకాణికి సుప్రభాతంగా మారిందన్నారు. లేని రూ.1400కోట్ల ఆస్తులను తమకు అంటగట్టిన కాకాణి అవి ఎక్కడ ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. సచివాలయ సిబ్బంది, అధికారులు గ్రామంలో టీడీపీ నాయకుల సహకారంతో గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మరో నెల రోజుల్లో గిరిజనులందరికీ ఆధార్, రేషన్‌కార్డులను ఇప్పించడంతోపాటు సంక్షేమ పథకాలు వారికి చేరేలా చూడడం అధికారుల బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, వల్లూరు మోహన్‌రావు, జనసేన కన్వీనర్ బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, వెటర్నరీ ఏడీ డాక్టర్ నిర్మల, పశు వైద్యాధికారి రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పది లక్షల చేప పిల్లలు

జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టులో పెద్దదైన అరణియార్ రిజర్వాయర్‌లో 10 లక్షల చేప పిల్లలను బుధవారం వదిలారు. మత్స్య కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఉచితంగా చేప పిల్లలను ప్రాజెక్టులో వదిలినట్లు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. కలర్ చేప పిల్లల పెంపకం కేంద్రాన్ని తనిఖీ చేసి ఎగుమతులు, దిగుమతులపై ఆరా తీశారు. అరణియార్ లోతట్టు ప్రాంతంలో రూ.2 కోట్లతో జరుగుతున్న పర్యాటకాభివృద్ధి పనులను పరిశీలించారు. ఆక్రమణలు తొలగించి వ్యూ టవర్ వరకు సిమెంటు రోడ్డు వేయాలన్నారు.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి

పార్ట్ టైం ఉద్యోగమంటూ.. రూ.17 లక్షలు కొట్టేశారు

● 'సైబర్' మోసగాళ్ల మాటలకు నష్టపోయిన మహిళ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సైబర్ ఉచ్చులో పడి ఓ మహిళ రూ.17 లక్షలు పోగొట్టుకున్నారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మినగర్‌కు చెందిన సుజాతకు ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేసే అవకాశం ఉందంటూ ఫోను వచ్చింది. పలుమార్లు ఫోన్లు చేసిన ఆమెను నమ్మించారు. దానికి సంబంధించి వాట్సాప్ మెసేజీలు పంపారు. ఆమెను తమ టెలిగ్రామ్ గ్రూపులో చేర్చి కొన్ని లింకులు పంపారు. స్టార్ హోటల్‌లో రేటింగ్ ఇచ్చే టాస్క్‌ల పేరిట నమ్మబలికారు. తొలిదశలో కొంత డబ్బు డిపాజిట్ చేయించి లాభాలు చూపించారు. మరింత సొమ్మును డిపాజిట్ చేస్తే ఇంకా లాభాలె వస్తాయన్నారు. దీంతో ఆమె బంగారం తాకట్టు పెట్టి, అప్పు చేసి దాదాపు రూ.17 లక్షలు వాళ్లు చెప్పిన ఖాతాలకు జమ చేశారు. ఆ తర్వాత ఒకేసారి ఆ అకౌంట్లు బంద్ కావడంతో తాను మోసపోయినట్లు ఆమె గ్రహించి.. రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు సైబర్ నేరంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాకు క్యూ కడుతున్న పరిశ్రమలు

అనుమతులు కోరుతున్న ప్రతిష్ఠాత్మక సంస్థలు

● తొలి ఆరు నెలల్లోనే అనూహ్య స్పందన

● సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవ ఫలితం

జిల్లాకు కొత్త పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ప్రముఖ సంస్థలు, కంపెనీలు పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతున్నాయి. దానికనుగుణంగా జిల్లా యంత్రాంగం భూముల అన్వేషణలో నిమగ్నమైంది. ఓవైపు భూసేకరణకు కసరత్తు చేస్తూనే మరోవైపు ఇప్పటికే గుర్తించిన పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వేగంగా చర్యలు తీసుకుంటోంది. తొలి ఆరు నెలల్లోనే జిల్లా పారిశ్రామిక రంగంలో ఈ అనూహ్య కదలిక సంభవించడం విశేషం. ఈ పరిణామం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చొరవ ఫలితమేనని చెప్పాలి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఎల్జీ ఎలక్ట్రానిక్స్

ఉత్పత్తులు: రిఫ్రిజిరేటర్స్, ఎయిర్ కండిషనర్స్, వాషింగ్ మెషీన్ తదితరాలు
స్థలం అడిగింది: శ్రీసిటీలో
పెట్టుబడి: రూ.5001 కోట్లు
ఉపాధి: జిల్లాలో 1495 మందికి ఉద్యోగావకాశాలు

ఎంతవరకు వచ్చింది: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్రం మొత్తమ్మీద తొలి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రాజెక్టు (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్టిమెంట్ ప్రాజెక్టు) కావడం విశేషం. దీనిపై సత్వరం స్పందించిన ప్రభుత్వం శ్రీసిటీ పరిసరాల్లో భూములను గుర్తించి ఏపీఐఐసీకి కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

2 వేల ఎకరాలతో శ్రీసిటీ విస్తరణ



కొత్త పరిశ్రమల ఏర్పాటుకు శ్రీసిటీ కీలకంగా మారుతున్న నేపథ్యంలో దీని విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శ్రీసిటీ రూపకల్పన ప్రణాళికలోనే 10 వేల ఎకరాల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉంది. అయితే తొలి దశలో 8 వేల ఎకరాలనే శ్రీసిటీకి ప్రభుత్వం కేటాయించింది. ఇపుడు అదనంగా అవసరం అవుతుండడంతో మిగిలిన 2 వేల ఎకరాలూ కేటాయించాలని శ్రీసిటీ యాజమాన్యం సీఎం చంద్రబాబును అభ్యర్థించింది. దీంతో సత్యవేడు మండలంలోనే మరో 2 వేల ఎకరాలు సేకరించి ఏపీఐఐసీ ద్వారా శ్రీసిటీకి కేటాయించాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే మరిన్ని కొత్త పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది.

వరదయ్యపాలెం మండలంలో 500 ఎకరాల సేకరణ

శ్రీసిటీ పరిసరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పలు సంస్థలు, కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. దీంతో శ్రీసిటీతో సంబంధం లేకుండా ఆ చుట్టుపక్కల ఏపీఐఐసీ ద్వారా పరిశ్రమలకు భూములు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వరదయ్యపాలెం మండలంలో 500 ఎకరాలు సేకరించేందుకు కలెక్టర్ కసరత్తు చేస్తున్నారు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు ఇందులోనే భూములు కేటాయించే అవకాశాలున్నాయి.

మరో 19 భారీ పరిశ్రమలకు ప్రతిపాదనలు

కొన్ని ఏపీఐఐసీ వద్ద, మరికొన్ని పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ ఎదుట, ఇంకొన్ని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ముంగిట.. ఇలా మరో 19 భారీ పరిశ్రమల ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి భూముల కేటాయింపు కోసం కసరత్తు జరుగుతోంది. ఏపీఐఐసీ క్లస్టర్లలో భూసేకరణ ప్ర క్రియ కూడా వివిధ దశల్లో ఉం ది. ఉదాహరణకు వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి శ్రీకాళహస్తి మొదటి క్లస్టర్‌లో ఏకంగా 10,608 ఎకరాలు సేకరిస్తున్నారు. రెండో క్లస్టర్‌లో 2628 ఎకరాలకుగానూ ఇప్పటికే 2169 ఎకరాల సేకరణ పూర్తయింది. కేవలం 459 ఎకరాలు మాత్రమే పెండింగ్ ఉంది. కృష్ణపట్నం ఇన్‌ఫ్రా క్లస్టర్‌లో 4731 ఎకరాల సేకరణ దాదాపు పూర్తయింది. ఆరు నెలల్లోపే ఈక్లస్టర్లలో పరిశ్రమలకు భూములను కేటాయించేఅవకాశాలున్నాయి.



రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

సుప్రసిద్ధ పారిశ్రామికవేత్త రతన్‌టాటా స్ఫూర్తితో ఆయన జ్ఞాపకార్థం జిల్లాలో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్ టెక్నాలజీలకు సంబంధించి వినూత్నమైన ఆవిష్కరణలను ప్రోత్సహించనున్నారు. ఈ హబ్‌ను తిరుపతి, రేణిగుంట నడుమ ఏర్పాటు చేయాలని సీఎం భావిస్తున్నారు. దీనికి పది ఎకరాలను కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇప్పటికే ఐఐటీ, ఐసర్, ఐడీటీ వంటి ప్రతిష్ఠాత్మక ఎలక్ట్రానిక్ టెక్నాలజీ సంస్థలతో పాటు ఈఎంసీ క్లస్టర్లున్న క్రమంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుతో ఐటీ పరంగా జిల్లా ప్రతిష్ఠ మరింత ఇనుమడించనుంది.

ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్

Phillips Carbon Black Limited

ఉత్పత్తులు: రబ్బర్ బ్లాక్స్, వాల్యూ యాడెడ్ కెమికల్స్
పెట్టుబడి: రూ.3718 కోట్లు
అడిగిన స్థలం : నాయుడుపేట ఎస్ఈజెడ్‌లో 116 ఎకరాలు
ఉపాధి: ప్రత్యక్షంగా 200 మందికి
దరఖాస్తు చేసింది: గతేడాది సెప్టెంబరులో

ఎంతవరకు వచ్చింది: కూటమి అధికారంలోకి వచ్చాక జిల్లాలో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన తొలి సంస్థ. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చొరవతో ఆ ఫైలు వేగంగా కదిలింది. గత నవంబరులో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ భూముల కేటాయింపునకు సిఫారసు చేయగా, బోర్డు ఆమోదించింది. నాయుడుపేట సెజ్‌ను ప్రభుత్వం డీనోటిఫై చేసి 116.62 ఎకరాల భూమిని ఫిలిప్స్ పరిశ్రమకు కేటాయించాలని ఏపీఐఐసీని ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఇపుడు పరిశ్రమ ఏర్పాటుకు భూములను కేటాయించడంతో పాటు ఇతర అనుమతులు జారీ చేసే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఈ ఏడాది ప్రథమార్థంలోనే పరిశ్రమ నిర్మాణం ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

క్రిస్ సిటీతో పారిశ్రామిక ప్రగతికి ఊపు

కృష్ణపట్నం పోర్టును, బెంగళూరు- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఆధారం చేసుకుని కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతిపాదించిన క్రిస్ సిటీ.. తొలి దశ పనులకు గతనెల 8న ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మూడు దశలుగా అమలయ్యే ఈ ప్రాజెక్టు మొత్తం పెట్టుబడి రూ.37 వేల కోట్లు. 4.67 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. తొలిదశ పనులను 2027 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయనున్నారు. అప్పటికి 2500 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమల స్థాపనకు సిద్ధం కానున్నాయి. రెండేళ్లలో తొలి దశ కింద రూ.7500 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటై 50 వేల ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా. తొలిదశ పనుల కింద రూ.2139 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగా, అందులో ఇప్పటికే రూ.1173 కోట్ల పనులు మొదలయ్యాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే అభివృద్ధి పరంగా జిల్లా స్వరూప స్వభావాలు గణనీయంగా మారనున్నాయి.

చిరుతలు, పిల్లల కోసం..!

● అటవీశాఖ, యూనివర్సిటీ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్ల గాలింపు

● పలుచోట్ల బోన్లు పెట్టిన అధికారులు





చిరుత ఆనవాళ్లను వెతుకుతూ.. - అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోను

మంగళం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): చిరుతలు, వాటి పిల్లల జాడ కోసం బుధవారం అటవీశాఖ.. ఎస్వీయూ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్వీయూ, వేద వర్సిటీ, ఎన్‌సీసీ ఆవరణ వెనుకవైపున కర్రలు చేతపట్టి అణువణువు చూశారు. నెల రోజులుగా ఈ ప్రాంతంలో చిరుతల సంచారంతో భయాందోళన చెందుతున్నారు. యూనివర్సిటీలో చిరుతతో పాటు పిల్లలూ ఉన్నట్లు అటవీశాఖ అధికారులకు కొందరు ఫోన్లు చేసి సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ, యూనివర్సిటీ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు దాదాపు 100 మంది నాలుగు బృందాలుగా విడిపోయి చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. విద్యార్థులు కర్రలతో, కొందరు సిబ్బంది సేఫ్టీ బ్లాక్ డ్రెస్‌తో పాల్గొన్నారు. పిల్లలతో చిరుత కనిపించినట్లు తమ దృష్టికి రావడంతో అధికారులకు చెప్పి గాలింపు చర్యలు చేపట్టామని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. చిరుతల కదలికలపై ఎప్పటికప్పుడు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇస్తున్నామన్నారు. యూనివర్సిటీ పరిధిలో చిరుత ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో మూడు బోన్లను, 30 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సబ్ డీఎఫ్‌వో నాగభూషణం తెలిపారు. వర్సిటీలో హాస్టళ్లు, జూపార్క్ రోడ్డులో ఫుడ్ కోర్టులో మిగిలిన ఆహార పదార్థాలను పడేస్తుండటంతో కుక్కలు, జింకలు వస్తున్నాయని, వీటిని వేటాడేందుకు చిరుతలూ వర్సిటీలోకి వస్తున్నట్లు వివరించారు. అందుకనే ఆహార పదార్థాలను బయట పడేయాలని, కుక్కలను పట్టి వేరేచోట వదలాలని చెప్పామన్నారు. అలిపిరి జూపార్క్ రోడ్డుకు ఇరువైపులా అటవీ ప్రాంతంలో పొదలు, కంపలు, గడ్డిని 30 మీటర్ల వరకు తొలగించాలని టీటీడీ అటవీశాఖను కోరుతామన్నారు. దీనివల్ల జంతువులు మనుషులపై అటాక్ చేయడం గానీ, రోడ్డు దాటి వర్సిటీ వైపు రావడం తగ్గుతుందన్నారు. చిరుత, వాటి పిల్లల ఆనవాళ్లు కనపడలేదన్నారు. ప్రతిరోజూ ఈ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుంటామన్నారు. తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్వీయూ ప్రాంతంలో తిరుగుతున్న జింకలు



అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సబ్ డీఎఫ్‌వో నాగభూషణం



చిందర వందరగా పడివున్న సామగ్రి

ముంగిలిపట్టులో దొంగల హల్‌చల్

● తొమ్మిది ఇళ్లలో చొరబడి రెండు ఇళ్ళలో చోరీ

చంద్రగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముంగిలిపట్టులో దొంగలు హల్‌చల్ చేశారు. తొమ్మిది ఇళ్ళల్లోకి చొరబడ్డారు. రెండు ఇళ్ళల్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి కె.లీల, ప్రతాప్‌నాయుడు, రామ్మూర్తి నాయుడు, శివల లక్ష్మణ్, సోమేశ్వరనాయుడు, గిరినాయుడు, దీలిప్, నాగమ్మ ఇళ్ళతో పాటు ఎస్టీకాలనీలోని మురళి ఇంటిలో దొంగలు చొరబడ్డారు. కె.లీల ఇంట్లో లక్ష రూపాయల నగదు, 30 గ్రాముల బంగారు ఆభరణాలు, మురళి ఇంట్లో 20 గ్రాముల బంగారు కమ్మలు తీసుకుపోయారు. బుధవారం ఉదయం బాధితుల ఫిర్యాదుతో సీఐ సుబ్బరామిరెడ్డి, సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. వారి ఇళ్ళను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో పాటు వేలి ముద్రల నిపుణులు వచ్చారు. వివరాలు సేకరించారు. క్రైం అడిషనల్ ఎస్పీ నాగుభూషణం, క్రైం డీఎస్పీ శ్యామ్ సుందర్, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ ప్రసాద్‌లు చేరుకుని సీసీ ఫుటేజ్ ద్వారా ఆధారాలు సేకరించారు. సుమారు ఏడుగురు దుండగులు చోరీలకు పాల్పడినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. తాళం వేసి ఉన్న ఇళ్లను ముందుగా గుర్తించి మధ్యప్రదేశ్‌కు చెందిన దుండగులు ఈ తరహా చోరీలకు పాల్పడినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యూపీ ముఠా పనేనా?

● జిల్లాలో వరుస దొంగతనాలతో హడలుతున్న జనం

● అప్రమత్తంగా ఉంటేనే సొత్తు భద్రం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): డబ్బున్న వారి ఇళ్లపై నిఘా పెడతారు. తాళాలు వేసిన ఇళ్లనూ గుర్తిస్తారు. ఆపై రెక్కీ నిర్వహిస్తారు. పోలీసు గస్తీ లేని చోట్ల.. ఒకవేళ ఉంటే ఏ సమయాల్లో వస్తారనేది గమనిస్తారు. ఆపై రాత్రి వేళ.. ఎలాంటి అలికిడి లేకుండా తాళాలు పగలగొడతారు. ఇంట్లో మనుషులున్నా శబ్దం వినిపించకుండా లోపలకు వెళ్లగలిగే నైపుణ్యం వీరి సొంతం. జిల్లాలో రెండు నెలలుగా జరిగిన ప్రధాన చోరీలను పరిశీలిస్తే.. ఇదే తరహాలో జరిగాయి. ఈ తరహా దొంగతనాలు చేయడంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్యాంగులది అందెవేసిన చేయిగా పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ గ్యాంగుల్లో 50 నుంచి 60 మంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో.. కొన్ని ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఐదారుగురు బృందాలుగా విడిపోయి దొంగతనాలకు పాల్పడుతుంటారని భావిస్తున్నారు. ప్రజల కష్టార్జితాన్ని సునాయాసంగా అపహరించే ఈ ముఠాలు పలు ప్రాంతాల్లో తిష్ట వేసినట్లు తెలుస్తోంది. మూడు రోజుల్లోనే దాదాపు పది ఇళ్లలో చోరీలు జరగడంతో జనం హడలిపోతున్నారు. ఇళ్లకు తాళం వేసుకుని వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. తిరుపతి నగరం, పట్టణాలు, గ్రామాల్లోనూ దొంగతనాలకు పాల్పడుతూ మధ్యప్రదేశ్ ముఠాలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. మరోవైపు గస్తీ విషయంలో పోలీసుల తీరుపై పలుచోట్ల విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు దొంగల ముఠాను పట్టుకునేలా గట్టి చర్యలు చేపట్టాల్సి ఉంది. మరోవైపు ప్రజలూ అప్రమత్తంగా ఉండాలి.

పోలీసు సూచనలు

● ఇంట్లో ఉన్నప్పుడూ అన్ని తలుపులు లాక్‌చేసి, కిటికీలు వేసుకోవాలి. బయట తలుపులపై డెడ్‌బోల్ట్ తాళాలు ఇన్‌స్టాల్ చేయండి. స్మార్టు తాళాలను ఉపయోగించాలి.

● ఇంటికి తాళాలేసి బయట ప్రాంతాలకు వెళ్లేట్లయితే సమీప స్టేషన్లలో సమాచారం ఇవ్వాలి. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా పోలీసులు ఆయా ఇళ్లకు సీసీ కెమెరాలు అమర్చుతారు. ప్రత్యేక దృష్టి పెడతారు.

● బంగారు నగలు, నగదు ఇళ్లలో ఉంచకూడదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. కొందరు బియ్యం బస్తాలు.. డబ్బాల్లో నగలు, నగదు ఉంచొద్దు.

● నిందితులు తొలుత షూ రాక్‌లలో తనిఖీ చేసి.. అందులో తాళాలు పెట్టి ఉంటే తీసుకుంటున్నారు. అందుకని ఇళ్ల తాళాలు బయట పెట్టడం సురక్షితం కాదు.

● మీ అపార్టుమెంట్లు.. ప్రాంతాలలో కొత్తగా వచ్చిన వారిపట్ల నిఘా ఉంచాలి. అనుమానాస్పద కార్యకలాపాలుంటే.. ఏదైనా అనుమానం వచ్చినా 100, 112 నెంబర్లకు ఫోనుచేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

● ఇళ్లచుట్టూ పొదలు, చెట్లు లేకుండా చూసుకోండి. ఎందుకంటే దొంగలు వాటిలో దాక్కునే అవకాశాలు ఎక్కువ.

ఇటీవలి దొంగతనాల్లో కొన్ని..

● సూళ్లూరుపేట మండలం మంగానెల్లూరుకు చెందిన జె.నీలమ్మ ఈ నెల 2వ తేదీన శ్రీకాళహస్తిలోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దొంగలు.. తాళం పగుల కొట్టి 10 సవర్ల బంగారు నగలు, రూ.10,000 నగదు అపహరించుకెళ్లారు.

● అదే రోజు రాత్రి తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం సమీపంలోని సీపీఆర్ విల్లాస్‌లోని 81వ నెంబరు విల్లాలోని మేఘనాథన్ ఇంటి వెనుక తాళం పగులకొట్టి లోపలకు వెళ్లారు. వీరి కుటుంబం మొదటి అంతస్తులో ఉన్నా సరే.. ఎలాంటి అలికిడి లేకుండా దొంగలు లోపలకు వెళ్లి దాదాపు 735 గ్రాముల బంగారు నగలు, రూ.3.5 లక్షల నగదు, 800 యూఎస్ డాలర్లు అపహరించుకుని వెళ్లారు. మరో ఇద్దరు పక్కనే ఉన్న టి.జగదీష్ ఇంట్లోకి వెళ్లి 45 గ్రాముల బంగారు, నాలుగు డైమండ్ లాకెట్లు ఎత్తుకుని పలాయనం చిత్తగించారు.

● తాజాగా చంద్రగిరి మండలం ముంగిలిపట్టులోని కె.లీల, మురళి ఇళ్లకు తాళం వేసి సొంత పనులు మీద బయటకు వెళ్లారు. సూళ్లూరుపేట తరహాలోనే ఇక్కడా దొంగతనం చేశారు.



జైరామ్ ఠాకూర్

తిరుమలలో క్రికెటర్ స్మృతి మంధాన

తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్, మహిళా క్రికెటర్ స్మృతి మంధాన దర్శించుకున్నారు. ఆలయం ముందు స్మృతి మంధానతో సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు.



కుటుంబ సభ్యులతో స్మృతి మంధాన

సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.21 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,599

తలనీలాలు సమర్పించినవారు: 16,069





వివిధ టోర్నీలో వచ్చిన పతకాలతో..

కష్టాలకు ఎదురొడ్డి నిలిచి యోగా రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించారు వెంకటగిరికి చెందిన వసంతలక్ష్మి. తిరుపతిలోనే ఇంటర్, డిగ్రీ చదివిన ఈమె లెక్కకు మించి యోగా వీడియోలతో యూట్యూబు వీక్షకుల్లో పేరు సంపాదించారు. ఇటీవల నిర్వహించిన యోగా ప్రక్రియ గిన్నిస్ రికార్డులో నమోదు కావడంతో సీఎం చంద్రబాబు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ,శాప్‌చైర్మన్ రవినాయుడు ప్రత్యేకంగా ఈమెను అభినందించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి ఆంధ్రజ్యోతితో తన అనుభవాలను పంచుకున్నారిలా..

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

వసంత 'యోగ'ం



●నిర్విరామంగా శిక్షణ తరగతులు ● గిన్నిస్ బుక్‌లో వెంకటగిరి మహిళ

ఇంటర్ చదువుతుండగానే నాకు పెళ్లయింది. మా ఆయన హేమాద్రి ఆర్టీసీ కండక్టర్. పెళ్లయినా తిరుపతిలో డిగ్రీ చదివాను. ఉద్యోగ జీవితంలో మాఆయనకు ఒడుదుడుకులు ఎదురయ్యాయి. ఆర్థికపరమైన సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో 2009లో హైదరాబాదుకు వలస వెళ్లాం. అక్కడే చిన్న చిన్న ఉద్యోగాలు చేశాను. పని ఒత్తిడిని భరించలేక 2011లో యోగా శిక్షణకు వెళ్లాను. ఇది నా జీవితగతిని మలుపుతిప్పింది. ఆరు నెలల్లోనే ఆసనాలన్నీ నేర్చుకున్నాను. నేనే ఎందుకు యోగా నేర్పకూడదనే తలంపు వచ్చింది.



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వసంతలక్ష్మి

వెనకడుగు వేయకుండా వెంటనే యోగా తరగతులు చెప్పడానికి శ్రీకారం చుట్టాను. యోగాలో మరిన్ని ఉన్నత కోర్సులు చేశాను. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి సర్టిఫికేషన్ తీసుకున్నాక మంచి అవకాశాలు వచ్చాయి. స్వదేశ, విదేశ యోగా టోర్నీలో పాల్గొన్న ప్రతిసారీ పతకాలొచ్చాయి. హైదరాబాదులో కేజీకే ఇన్‌స్టిట్యూట్ 'యోగావిశారద బిరుదు ప్రదానం చేయడంతో గుర్తింపు వచ్చింది. కరోనా సమయంలో అపోలో ఆస్పత్రి చైర్మన్ ప్రతాప్ సిరెడ్డి సూచనతో చిత్తూరు జిల్లాలోని 252గ్రామాల్లో యోగా శిబిరాలను నిర్వహించాను. చాలామంది కరోనా నుంచి బయటపడటంతో ప్రతాప్ సిరెడ్డితో పాటు ప్రజలు విశేషంగా ఆదరించారు. వివిధ ఛానల్స్ నుంచి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కెరీర్‌కు గట్టి పునాది వేసుకోగలిగాను. ఇప్పుడు అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, నైరోబి, మరికొన్ని దేశాల వారికి ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహిస్తున్నాను. మన దేశానికి చెందిన వివిధ వృత్తి నిపుణులు ఇందులో పాల్గొంటున్నారు. అధికబరువు, థైరాయిడ్, మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగాసనాలు చక్కటి పరిష్కారమని నిరూపించడంలో సఫలీకృతమయ్యాను. 2020లో చొరవ తీసుకుని వసంతయోగా అకాడమీ పెట్టాను. 2023 నవంబరులో సంస్థ సారథ్యంలో 45మందితో 28నిమిషాల్లో చేసిన 108 సూర్యనమస్కారాల కార్యక్రమం రికార్డు నెలకొల్పింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, ఆన్‌లైన్ క్లాసుల ద్వారా నోబుల్ బుక్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులు వరించాయి. 2023 డిసెంబరులో 3.42గంటలపాటు చేసిన 'సమకోణాసనం' గతేడాది డిసెంబరులో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు దక్కించుకుంది. ఏదశలోనూ నిరాశను దరిచేయకుండా పట్టుదలతో పనిచేయడాన్ని అలవర్చుకోవడం వల్లే యోగా వసంతలక్ష్మిగా గుర్తింపు పొందగలిగానని వసంతలక్ష్మి వివరించారు.



కుమారుడు, భర్తతో వసంతలక్ష్మి

'విశ్వంభర' బ్లాక్‌బస్టర్ అవుతుంది

తిరుమల, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని ఆ చిత్ర దర్శకుడు వశిష్ట ధీమా వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం'విశ్వంభర' చిత్రం షూటింగ్ జరుగుతోందని, మధ్యలో శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానని తెలిపారు. విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఓప్రశ్నకు బదులిచ్చారు.



దర్శకుడు వశిష్ట





అలిపిరి తీరు మారదా?

అన్యమత స్టిక్కర్‌తో తిరుమలకు కారు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు ముఖద్వారమైన అలిపిరిలో మరోసారి భద్రతావైఫల్యం బయటపడింది. అన్యమత వ్యాఖ్యలతో కూడిన స్టిక్కర్‌తో ఓ కారు నేరుగా తిరుమలకు చేరుకుంది. సాధారణంగా రాజకీయ, ఇతర మత గుర్తులు, జెండాలతో తిరుమలకు రావడం నిషేధం. బుధవారం ఓ కారు అన్యమతానికి చెందిన వ్యాఖ్యతో ఉన్న స్టిక్కర్‌తో తిరుమలకు చేరుకుంది. దీనిని చూసిన పలువురు మీడియాకు సమాచారం ఇచ్చారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై ఆ కారును వెనక్కి పంపేశారు.

మరి దీన్నేమంటారు..?

● డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారని కక్షకట్టిన వైసీపీ

● టౌన్ బ్యాంకు అధికారులతో బెదిరింపులు ● లోను కట్టకపోతే దండోరా వేస్తామంటూ హెచ్చరిక

తిరుపతి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారన్న కారణంగా తమ అధికారంలో ఉన్న టౌన్ బ్యాంకును అడ్డుపెట్టుకుని వైసీపీ కక్షపూరిత చర్యలకు పూనుకుంది. తిరుపతి టౌన్‌బ్యాంకులో తీసుకున్న లోను బకాయి ఇప్పటికిప్పుడు చెల్లించాలంటూ బుధవారం ఉదయం 17వ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి ఇంటికి అధికారులు వెళ్లారు. ఉన్నపళంగా చెల్లించకపోతే వీధిలో దండోరా వేస్తామని హెచ్చరించారు. బంధువులందరికీ ఫోన్లు చేసి బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించలేదంటూ బదనాం చేస్తామని బెదిరింపులకు పూనుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హఠాత్తుగా లోను కట్టాలని రావడం ఏమిటని, గడువు ఇస్తే చెల్లిస్తామని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకుని టౌన్ బ్యాంకు సిబ్బందితో మాట్లాడి పంపించేశారు. పైస్థాయిలో ఒత్తిడి కారణంగా తాము రావాల్సివచ్చిందని వారు చెప్పినట్టు తెలిసింది. టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తాళ్లూరు ప్రసాద్ వైసీపీ నాయకుడు. ఆయన భార్య రత్నకుమారి 17వ డివిజన్ కార్పొరేటర్. టౌన్ బ్యాంకు నుంచి ఇరువురు కలసి సుమారు రూ.15లక్షల రుణం తీసుకున్నారు. తాజాగా జరిగిన కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో వైసీపీ శిబిరంలోనే ఆమె ఉంటూ వచ్చారు. ఎన్నిక రోజు కూడా వారి బస్సులోనే సెనెట్ హాలుకు చేరుకున్నారు. ఓటు మాత్రం కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణకు వేశారు. దీంతో కౌన్సిల్ హాలులోనే కొందరు వైసీపీ మహిళా కార్పొరేటర్లు ఆమెను తూలనాడారు. సమావేశం అనంతరం ఆమె విలపిస్తూ సొమ్మసిల్లి బయట సోఫాలో వాలిపోయారు. 24 గంటలు గడవకముందే వైసీపీ తన పాత వైఖరినే ప్రదర్శించింది. వైసీపీ నేతృత్వంలోని టౌన్ బ్యాంకు పాలకమండలిని అడ్డుపెట్టుకుని కక్షకు తెరలేపింది. నిన్నటివరకు తమ కార్పొరేటర్ల ఆస్తులను కూల్చేస్తామని కూటమి నేతలు బెదిరిస్తున్నారంటూ వైసీపీ నేతలు గగ్గోలు పెట్టారు. మరి వారికి అనుకూలంగా ఓటు వేయలేదని, టౌన్‌బ్యాంకులో ఉన్న అధికారంతో తన పార్టీ కార్పొరేటర్ మీదే పగతీర్చుకోవడాన్ని ఏమంటారో సమాధానం చెప్పాల్సి వుంది.



రత్నకుమారి ఇంటి వద్ద టౌన్‌బ్యాంకు సిబ్బంది

జిల్లాకు 56 కొత్త బస్సులు

కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాకు ఈ ఏడాది 56 కొత్త బస్సు సర్వీసులు రానున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ నరసింహులు తెలిపారు. బుధవారం కోట బస్టాండ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 846 బస్సులు కండిషన్‌లో ఉంటూ వివిధ ప్రాంతాలకు తిరుగుతున్నాయన్నారు. తిరుపతి నగరంలో నాలుగు డిపోల నుంచి 400 బస్సులు తిరుమలకు రాకపోకలు సాగిస్తున్నాయని, ఇందులో 100 ఎలక్ట్రికల్ బస్సులు కూడా నడుపుతున్నామన్నారు. కోట నుంచి తిరుమల, చిట్టమూరు నుంచి చెన్నైకు బస్సు సర్వీసులను నడపాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని, ఆయా సర్వీసుల ఏర్పాట్లపై దృష్టి పెడుతామన్నారు. జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్ల కొరత ఉన్నందున డ్రైవింగ్‌లో అనుభవం కలిగిన యువతకు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాలు చేపడుతామన్నారు. ఆయన వెంట వాకాడు డీఎం చినపెంచలయ్య, జూనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, గ్యారేజ్ ఇన్‌చార్జి నారాయణ, కంట్రోలర్ జార్జ్ ఉన్నారు.



మీడియాతో ఆర్ఎం నరసింహులు

గ్రావెల్ తవ్వకాలపై ఆర్డీవో చర్యలు

రెండు హిటాచీల సీజ్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పూలతోటమిట్ట నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా రవాణ చేసే గ్రావెల్ మట్టి మాఫియాపై సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి బుధవారం దాడులు జరిపింది. రెండు రోజులుగా పూలతోటమిట్ట గ్రామంలోని అసైన్‌మెంట్ భూముల నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి సూళ్లూరుపేట ప్రాంతంలోని ఓ పరిశ్రమకు తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో బుధవారం ఆర్డీవో గ్రావెల్ తవ్వుతున్న భూములను పరిశీలించారు. అక్కడున్న రెండు హిటాచీలను సీజ్ చేసి ఎస్ఐ అజయ్‌కుమార్‌కు అప్పగించారు. అనుమతి లేకుండా గ్రావెల్‌ను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు.



ఎస్ఐకు సూచనలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

చైర్మన్‌గా ఉన్నా సేవకుడినే..

● భావోద్వేగానికి గురైన బీఆర్ నాయుడు



తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చైర్మన్ పదవి వచ్చినా తానూ సేవకుడినేనని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తిరుమలలోని శ్రీవారిసేవాసదన్-2లో బుధవారం ఆయన శ్రీవారిసేవకులను ఉద్దేశించి మాట్లాడుతూ..తాను కొన్నేళ్లుగా శ్రీవారికి సేవ చేయాలని చాలా ప్రయత్నించానన్నారు. మూడు నెలల క్రితం సీఎం చంద్రబాబు తనకు చైర్మన్‌గా సేవ చేసే అవకాశమిచ్చారంటూ కంటనీరు పెట్టుకున్నారు. వెంటనే భావోద్వేగాన్ని అదుపు చేసుకున్నారు. ఎన్నోసార్లు స్వామి దర్శనం లభించకగా తిరిగి వెళ్లిపోయిన సందర్భాలున్నాయని గుర్తు చేసుకున్నారు. రథసప్తమి సందర్భంగా భక్తులకు సేవలందించిన శ్రీవారి సేవకులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఎప్పుడైనా నేరుగా వచ్చి తనను కలవచ్చునన్నారు. అనంతరం ఆలయంలో పనిచేసేందుకు డిప్ సిస్టమ్ బటన్ నొక్కి ఆన్‌లైన్‌లో 520 మందికి సేవ చేసేలా ఆటోమెటిక్ కేటాయింపు చేశారు. అనంతరం చైర్మన్‌ను సీపీఆర్వో రవి శాలువాతో సత్కరించారు.

ఆగివున్న మినీ లారీని ఢీకొన్న కారు

మహిళ దుర్మరణం, మరో నలుగురికి తీవ్ర గాయాలు ● తిరుమల వెళ్లొస్తుండగా ప్రమాదం









మృతి చెందిన ప్రవీణ - వ్యాన్‌ను ఢీకొన్న కారు - గాయపడిన అనూష, లక్ష్మీనారాయణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలించే మినీలారీ టైరు పంచరై.. రోడుపైన ఆగింది. దీనిని కారు ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేటకు చెందిన ప్రవీణ, ఆమె కుమార్తె అనూష, వారి సమీప బంధువులైన పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన విశ్వనాథముని లక్ష్మీనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు, కుమారుడు సుమంత్ కలిసి మంగళవారం కారులో తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం తిరిగి నాయుడుపేటకు వెళ్తుండగా బుధవారం తెల్లవారుజామున మల్లాం జంక్షన్ సమీపంలోని రింగ్‌రోడ్డు వద్ద ఆగివున్న మీని లారీని వీరి కారు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ(44) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది, పోలీసులు క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి, ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సుమంత్, లక్ష్మీనారాయణ పరిస్థితి విషమంగా ఉండడంలో నెల్లూరుకు పంపించారు. ప్రవీణ మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. నాయుడుపేట పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మినీ లారీ టైరు పంక్చర్ అవడంతో రోడ్డుమీద ఆగిపోయిందని, డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. మినీలారీలో ఉన్న 3,300 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం ఏఎంసీ గోదాముకు తరలించారు.

మద్యం షాపులకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 5 ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మిక ఉపకులాల వారికి కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువును ఈనెల 8వ తేది వరకు పొడిగించినట్లు జిల్లా ఈఎస్ నాగ మల్లేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వీరికోసం జిల్లాలో 23 మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించినట్లు వివరించారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సాధారణ లైసెన్సు ఫీజులో సగం ధరనే వీరికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలోని ఏ పట్టణం, నగరం, మండలంలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఈ నెల 10న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన దుకాణాల ఎంపిక, కేటాయింపులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని గీత కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నాగమల్లేశ్వరరెడ్డి

కొందరు కార్పొరేటర్లపై వైసీపీ వేటు

● మరికొందరికి వెసులుబాటుపై పార్టీలో అంతర్గత చర్చ

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమికి మద్దతు పలికిన కార్పొరేటర్లలో కొందరిపై వైసీపీ బహిష్కరణ వేటు వేసింది. మరికొందరిని వదిలేయడం ఆ పార్టీలో అంతర్గత చర్చ మొదలైంది. 10వ డివిజన్ కార్పొరేటరు ప్రతాప్‌రెడ్డి, 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళ్లిక, ఆమె భర్త దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, 32వ డివిజన్ కార్పొరేటర్ శైలజ, ఆమె భర్త వేణుగోపాల్, 33వ డివిజన్ కార్పొరేటర్ దూది కుమారి, ఆమె భర్త శివప్రసాద్, 43వ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రాధ, ఆమె భర్త మురళియాదవ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడి పేరుతో ప్రకటన విడుదల చేశారు. ఇక, కూటమి అభ్యర్థికి ఓటు వేసిన వైసీపీ కార్పొరేటర్లు అనీషరాయల్, బోకం అనిల్, మోహన్ కృష్ణయాదవ్, తటస్థంగా ఉన్న పల్లూరు అమరనాథరెడ్డిపై వేటు పడకపోవడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముందస్తు ప్రణాళికతోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారా అన్న చర్చ కూడా నడుస్తోంది. వైసీపీ వాళ్లతో పాటే సెనేట్ హాలులోకి వెళ్లి.. కూటమి అభ్యర్థికి మద్దతిచ్చిన తాళ్లూరి రత్నకుమారిపైనా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మళ్లీ రూ.వంద కోట్లు దాటింది

● 35 నెలలుగా.. ప్రతినెలా శ్రీవారి హుండీ ఆదాయం రూ.వంద కోట్లపైనే

తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం మళ్లీ వంద కోట్లు దాటింది. జనవరిలో భక్తులు హుండీలో వేసిన కానుకల ద్వారా రూ.106.17 కోట్లు లభించాయి. కాగా, కొవిడ్ అనంతరం 2022 మార్చి నెల నుంచి ప్రతి నెలా రూ.వంద కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తున్న విషయం తెలిసిందే. 2022 మార్చి నుంచి డిసెంబరు నెల నాటికి రూ.1,291.69 కోట్లు, 2023లో రూ.1,403.47 కోట్లు, 2024లో 1,365 కోట్లు హుండీ ద్వారా లభించాయి. ఇక, 2025 జనవరి నెలలో రూ.106.17 కోట్లు లభించడం గమనార్హం. ఇలా 35 నెలలుగా.. ప్రతి నెలా రూ.వంద కోట్లకుపైగా శ్రీవారి హుండీ కానుకలు లభిస్తున్నాయి. టీటీడీ ప్రధాన ఆర్థిక వనరుగా స్వామి హుండీ మారుతోంది.

స్విమ్స్‌లో మృతదేహం కోసం ఆందోళన

మాకివ్వాలంటే మాకివ్వాలని రెండు వర్గాల పట్టు

సర్దిచెప్పి పంపిన పోలీసులు, స్విమ్స్ అధికారులు



స్విమ్స్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మృతదేహాన్ని తమకంటే తమకు అప్పగించాలంటూ రెండు వర్గాల వారు స్విమ్స్‌లో ఆందోళనకు దిగారు. నారాయణవనం మండలం చిత్తూరుకండ్రిగకు చెందిన రిటైర్డ్ విద్యుత్తు ఉద్యోగి కేవీ.సుబ్రహ్మణ్యం(79) అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన రెండో భార్య ఝాన్సీ మంగళవారం రాత్రి స్విమ్స్‌కు తీసుకురాగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య పద్మావతి స్విమ్స్‌కు చేరుకుని మృతదేహాన్ని తమకు అప్పగించాలని కోరారు. స్విమ్స్ అధికారులు కూడా మృతదేహాన్ని ఆమెకు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. ఆయన 30 ఏళ్లుగా తమ వద్దే ఉన్నారని, చిత్తూరుకండ్రిగలోనే అంత్యక్రియలు నిర్వహించాలని ఆయన బతికున్నప్పుడే రాసుకున్నాడని రెండో భార్య ఝాన్సీ చెప్పారు. నిబంధనల మేరకు మృతదేహాన్ని మొదటి భార్యకే అప్పగిస్తామని స్విమ్స్ అధికారులు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మార్చురీ ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వెస్ట్ పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ససేమిరా అన్నారు. చాలాసేపు చర్చల తర్వాత అందరూ కలిసి మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

భూమన అభినయ్‌పై కేసు

తిరుపతి(నేర విభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత భూమన అభినయ్‌పై అలిపిరి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రాం కిషోర్ తెలిపిన ప్రకారం.. డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో కూటమి నాయకులను కార్పొరేటర్ స్రవంతి తమ్ముడు రాజేష్ బెదిరిస్తున్నాడని కొందరు టీడీపీ నాయకులు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం రాజేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన అభినయ్ తన అనుచరులతో అలిపిరి పోలీసు స్టేషన్‌కు వెళ్లి రాజేష్‌ను విడిచి పెట్టాలని డిమాండు చేశారు. పోలీసు అధికారుల ఆదేశాలు ఉన్నాయని సిబ్బంది చెప్పినా అభినయ్ వాగ్వాదానికి దిగారు. దీనిపై పోలీసులు సుబ్రమణ్యం, చంద్ర, ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రేషన్ సరఫరాలో అవకతవకలా..

94905 51117కు ఫిర్యాదు చేయండి

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'రేషన్ సరఫరా.. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాల్లో ఏవైనా అవకతవకలు జరుగుతున్నాయా? అలాంటి వాటిని వీడియోల ద్వారా 94905 51117 నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు' అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. గూడూరులోని సీఎస్ఎం ఉన్నత పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించిన ఆయన ఆహార నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పేదలకు నాణ్యత కలిగిన రేషన్‌బియ్యం పంపిణీ చేసేలా ఫుడ్‌కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. కొన్ని పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా సరఫరా చేస్తున్న ఆహారం రుచిగా లేదని ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సరిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు చంద్రశేఖర్, డిప్యూటీఈవో సనత్‌కుమార్, ఎంఈవో కాంచన, సీడీపీవో మెహబూబి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

వసతుల మెరుగుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు పంచాయతీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షిస్తూ వుండాలని జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, వీధి లైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలన్నారు. డ్రైనేజీ కాలువలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయిస్తూ మురుగు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత త్వరగా చెత్త సంపద తయారీ కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. విధి నిర్వహణలలో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో మధుసూదన్‌రావు, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.6.22 కోట్లతో ఉపాధి పనులు



ఉపాధి పనుల వివరాలు వెల్లడిస్తున్న ఏపీవో ఉషారాణి

ఓజిలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలోని 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.6.22 కోట్ల ఉపాధి పనులు జరిగాయని ఏపీఓ ఉషారాణి తెలిపారు. ఓజిలి మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. విద్య, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, విద్యుత్, ఉపాధి, రెవెన్యూ, పంచాయతీరాజ్, పశువైద్య అధికారులు వారి శాఖల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ప్రసాద్ నాయుడు, అత్తివరం, అరిమేనిపాడు ఎంపీటీసీ సభ్యులు కలపాటి శేఖర్, రఘురామరాజు, అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బద్దెపూడి సేవలు మరవలేనివి



బద్దెపూడికి నివాళులర్పిస్తున్న పార్థసారధిరెడ్డి, వేణుయాదవ్, కిరణ్ కుమార్ రెడ్డి, కాటయ్య తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బద్దెపూడి వేణుగోపాల్ రెడ్డి సేవలు మరవలేనివని జై గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు బి.పార్థసారధి రెడ్డి అన్నారు. బుధవారం బద్దెపూడి వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా షార్ బస్టాండు వద్ద జై గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బద్దెపూడి చిత్రపటం ఏర్పాటు చేసి పూల మాలలువేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం మున్సిపాలిటీలో పనిచేసే మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెట్టి వేణుయాదవ్, కళత్తూరు కిరణ్ కుమార్ రెడ్డి, పొన్నా కాటయ్య, బూరగ మనోహర్, సుంకర ప్రతిమ, చిలకా యుగంధర్, కాకి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని డీపీవో సుశీలాదేవి అన్నారు. బుధవారం దొరవారిసత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల్లో సేకరించే చెత్త నుంచి ఎరువులు తయారు చేసేలా సంపద తయారీ కేంద్రాలను ప్రారంభించాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీవో రవికుమార్, దొరవారిసత్రం, తడ ఎంపీడీవోలు గోవర్ధన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మెరుగైన విద్యాబోధన



సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, అధ్యాపకులు

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనను అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. బుధవారం కళాశాలలో ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు డిగ్రీ కళాశాలను సందర్శించి వివిధ కోర్సుల వివరాలు, సౌకర్యాలను పరిశీలించారన్నారు. తమ కళాశాలలో ఎంతో అనుభవం, అర్హత కలిగిన అధ్యాపకులు, విశాలమైన ఆటస్థలం, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, వ్యాయామశాల తదితర సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కృపాకరుణవాణి, నారాయణరాజు, శ్రీధర్‌శర్మ, కోటేశ్వరరావు, పీరకుమార్, విజయ్‌మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించండి

నాయుడుపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆప్కాస్‌లోని కార్మికులకు 3నెలలు, నాన్ ఆప్కాస్‌లోని కార్మికులకు 7 నెలలు వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు మధు, హరికృష్ణ మహా లక్ష్మమ్మ, మణి, ఆరావళి, రమణమ్మ పాల్గొన్నారు.

దేవదాయశాఖ భూములను ఆక్రమించిన ఒకరిపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ పరిధిలోని విన్నమాల జాతీయ రహదారి సమీపంలో దేవదాయశాఖకు చెందిన 26సెంట్ల భూమిని ఆక్రమించిన శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. విన్నమాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు దేవదాయశాఖ భూమిని ఆక్రమించారని ఈవో రవికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను పాటించకుంటే చర్యలు తప్పవని అర్బన్ సీఐ బాబి హెచ్చరించారు. బుధవారం నాయుడుపేట అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ఆటో డ్రైవర్లు, వాహన చోదకులతో సీఐ మాట్లాడారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను డ్రైవింగ్ సమయంలో దగ్గర ఉంచుకోవాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశాల్లో కాకుండా ఎక్కడబడితే వాహనాలను ఆపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

టిడ్కో ఇళ్లకు మంచి రోజులు

- సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు
- త్వరలో వడ్డీ బకాయిల చెల్లింపులు
- జూన్‌లో గృహప్రవేశాలకు ముహుర్తం



వెంకటగిరి పట్టణం తిరుపతి రోడ్డులోని టిడ్కో ఇళ్లు

వెంకటగిరి టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులకు సొంతింటి కల త్వరలో నెరవేర నుంది. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల రుణాల వడ్డీ బకాయిలు చెల్లించి వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి స్థాయిలో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్య షేర్‌వాల్ సాంకేతికతతో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. కోట్లాది రూపా యలతో మూడు క్యాటగిరిల్లో (300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంతో) వెంకటగిరిలో 1824 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 2019నాటికి 80శాతం పనులు పూర్తయ్యాయి. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేయకపోవగా, నిర్మించిన ఇళ్లకు వైసీపీ రంగు లేసి కాలం గడిపింది. కూటమి అధికారంలో వచ్చాక టిడ్కో గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేస్తోంది. ఆర్థిక భారం తగ్గించాలని పట్టణాల్లో 300 చదరపు అడుగుల ఇళ్లు 1536, 365 అడుగుల ఇళ్లు 96, 430 అడుగుల ఇళ్లు 192 నిర్మించారు. 2019లో టీడీపీ ప్రభుత్వ పాలన ముగిసే నాటికి లబ్ధిదారుల వాటా ఆరంభ నిధిని అధికారులు స్వీకరించారు. నిర్మాణాల నిధుల కోసం బ్యాంకులకు దరఖాస్తు చేశారు. వీటిలో 117 ఇళ్లకు బ్యాంకు రూ.2.5కోట్లు రుణాలు కూడా మంజూరు చేసింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ అసంపూర్తిగా మిగిలిన ఇళ్లకు రుణాలివ్వకపోగా ఇచ్చిన రుణాలపై అలసత్వం వహించింది. ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం హడావుడి చేసి కొంతమంది లబ్ధిదారులకు రూ.1కే రిజిస్ట్రేషన్ అని నామమాత్రంగా ఇళ్లను ఇచ్చారు. 672 మందికి ఇళ్లు కట్టించలేక తిరిగి వారికి జగనన్న లేఅవుట్‌లో స్థలం కేటాయించారు. ఇటీవల టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే కురుగండ్ల పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్లను అన్ని వసతులతో లబ్ధిదారులకు అప్పగించి సాముహిక గృహప్రవేశాలు చేస్తామన్నారు. ఇళ్లు లేనివారు సంబంధిత అధికారులకు అర్జీలు ఇస్తే పరిశీలించి 30 రోజుల్లో అందించే దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కురుగండ్ల హామీ ఇచ్చారు.

ప్రతిపల్లెకూ బస్సు సౌకర్యం కల్పిస్తాం: పాశిం



పొద్దుటూరు, కడప బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు

కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లెకూ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా వాకాడు డిపోలో రూ.6 కోట్ల వ్యయంతో పది నూతన బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. వాకాడు డిపోకు చెందిన పది నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను బుధవారం కోట బస్టాండ్‌లో ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో ప్రతి పల్లెకూ ఆర్టీసీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రారంభించిన పది బస్సు సర్వీసులు కోట నుంచి పొద్దుటూరు, కడప, తిరుపతి, నెల్లూరు నగరాలకు నడపనున్నట్లు పేర్కొన్నారు. అలాగే గూడూరు రైల్వే స్టేషన్ నుంచి నేరుగా తిరుమలకు బస్సు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాతబడిన బస్సులు నడుపుతూ ప్రయాణికులను అసౌకర్యానికి గురిచేయడమే కాకుండా ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టారని విమర్శించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నాయకులు తీగల సురేష్‌బాబు, దారా సురేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, షంషుద్దీన్, కోటేశ్వరప్రసాద్, చంద్రశేఖర్, సుధాకర్‌శెట్టి, కోటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తూము, పంటకాలువ పూడ్చివేతపై రైతుల ఆందోళన



పంటకాలువ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

చిల్లకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులోని జాతీయ రహదారికి సమీపంలోని లే అవుట్ ఏర్పాటుకు మట్టి తొలి చదును చేసే క్రమంలో తూము, పంటకాలువను పూడ్చివేస్తున్నారని బుధవారం స్థానిక రైతులు లేఅవుట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పొలాలకు సమీపంలోని నడితూము వద్ద లేఅవుట్ ఏర్పాటు చేసేందుకు మట్టి తొలి చదును చేస్తున్నారని, దీనివల్ల తమ పొలాలకు సాగునీరు అందించే తూము, పంట కాలువల పూడిపోయే పరిస్థితి నెలకొందన్నారు. తూము పూడిపోతే సుమారు 450 ఎకరాల పంట నీట మునగడంతో పాటు సుమారు 300 ఎకరాలకు సాగునీరు నిలిచి పోతుందన్నారు. అధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, పిశ్శిళ్ల రమేష్, మల్లికార్జున్‌రెడ్డి, బాలరమణయ్య, గోవర్ధన్, సుబ్రహ్మణ్యం, దాసు, మాతయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు

చిల్లకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను బుధవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. వంటగది, వసతి గృహాన్ని పరిశీలించారు. భోజన నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ అనిల్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని బీసీ గురుకులాన్ని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. భోజనశాలను పరిశీలించి వంటకాలను రుచిచూశారు. వంటల్లో నాణ్యత ఉండేలా చూడాలని ప్రిన్సిపాల్ తిరుపతయ్యకు సూచనలు చేశారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కోచ్‌లు వినోద్‌కుమార్, పవన్‌కుమార్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జేఎన్‌టీ స్టేడియంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఆంధ్రప్రదేశ్ యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో సూళ్లూరుపేట టైనీటాట్స్ పాఠశాల విద్యార్థులు లిఖితా కుమారి, కె.వెంకటశ్రావణి ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, మాస్టర్స్ తైక్వాండో క్లబ్ వ్యవస్థాపకుడు పవన్‌కుమార్, కోచ్‌లు వినోద్‌కుమార్, ఎస్కే అఫ్రష్ అభినందించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దొరవారిసత్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి అన్నారు. దొరవారిసత్రం వెలుగు కార్యాలయంలో బుధవారం పొదుపు మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మునిరాజ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులు అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులకు బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి షీల్డులు, మెమెంటోలతో అభినందించారు. కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు గత నెలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 22 మంది ప్రతిభ చూపి ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషన్‌దార్, విభాగాధిపతులు అభినందించారు.

జోరుగా వరి కోతలు



కోటపోలూరు వద్ద యంత్రాలతో వరికోతలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్‌లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. రబీ సీజన్‌లో ముందుగా నాట్లు వేసిన పంటలు కోతదశకు చేరుకున్నాయి. మండల పరిధిలోని మంగళంపాడు, కోటపోలూరు, సామంతమల్లాం, కడపత్ర, ఎన్‌వీకండ్రిగ, మన్నారుపోలూరు తదతర గ్రామాల్లో యంత్రాలతో వరి కోతలు చేస్తున్నారు. వరుస వర్షాలతో ఈ సారి దిగుబడులు ఆశాజనకంగా లేవని రైతులు వాపోతున్నారు.

మహనీయుల చరిత్ర తెలుసుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో అశువులు బాసిన అమరవీరులు, మహనీయుల చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని డీఆర్‌డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. బుధవారం కళాశాలలో ప్రజాసంఘాలు, ఫ్రీడమ్‌ఫైటర్స్ ఎక్స్‌పో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఈనెల 8,9 తేదీల్లో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్‌రహీం, కాలేషా, మౌలానా, శశికుమార్, జమాలుల్లా, సురేష్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర

పెళ్లకూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు గ్రామంలో పోలేరమ్మ జాతరను మంగళవారం రాత్రి నుంచి వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి పోలేరమ్మను దర్శించుకునేందుకు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో నిరీక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోలేరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం



సాయి(ఫైల్‌ఫొటో)

ఓజిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రమావశాత్తు రైలు ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఓజిలికి చెందిన వెంకటసుబ్బయ్య, పద్మమ్మ దంపతుల కుమారుడు సాయి(21) కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. వెంకటసుబ్బయ్య వ్యవసాయంతో పాటు గేదెలు మేపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం మేతకు వెళ్లిన గేదెలు సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో వాటి వెతికేందుకు ఓజిలికి సమీపంలోని చెరువు వద్దకు సాయి వెళ్లాడు. చెరువు సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గాలిస్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రైనా సాయి ఇంటికి రాకపోవడంతో బంధువులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం రైలు పట్టాల పక్కన మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి గూడూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖినదిలో పడి యువకుడి మృతి



సుకుమార్ (ఫైల్‌ఫొటో)

వాకాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు స్వర్ణముఖినదిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన వాకాడు మండలంలోని బాలిరెడ్డి పాళెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన విన్నమాల సుకుమార్ (26) బుధవారం ఉదయం స్వర్ణముఖినదిలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అదుపుతప్పి నదిలో పడి మృతి చెందాడు. కొంతసేపటి తరువాత మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు.

బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ ఆకస్మిక మృతి



నరసయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న బెటాలియన్ ఆర్ఐ సత్యనారాయణ, ఆర్ఎస్ఐ కోటేశ్వరరావు

పెళ్లకూరు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని 9వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ నరసయ్య(34) ఆకస్మికంగా మృతి చెందాడు. పెళ్లకూరు మండలంలోని జీలపాటూరు గ్రామానికి చెందిన నరసయ్య 9వ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం పోలేరమ్మ జాతర నిర్వహిస్తుండడంతో ముందురోజే గ్రామానికి చేరుకున్నాడు. బంధుమిత్రులతో జాతరలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. బుధవారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. బెటాలియన్ ఆర్ఐ సత్యనారాయణ, ఆర్ఎస్ఐ కోటేశ్వరరావు జీలాపాటూరుకు చేరుకుని నరసయ్య మృతదేహానికి నివాళులర్పించారు. రూ.లక్ష సాయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

టీడీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కోట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో ఎంపీటీసీ నారాయణ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, టీడీపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల నారాయణ తల్లి పోలమ్మ మృతి చెందారు. బుధవారం ఎమ్మెల్యే కొత్తపాళెం గ్రామానికి వెళ్లి పోలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా శ్రీమంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



అభిమానులు సమక్షంలో కేక్‌కట్ చేస్తున్న మున్సిపాలిటీ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, పక్కన తడ ఎంపీపీ రఘురెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఆయన నివాసంలో అభిమానుల సమక్షంలో కోలాహలంగా జరిగాయి. కేక్ కట్ చేశారు. శ్రీమంత్ రెడ్డికి పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళత్తూరు శేఖర్ రెడ్డి, తడ ఎంపీపీ కొళవి రఘురెడ్డి, గండవరం సురేష్ రెడ్డి, నాయకులు బాబురెడ్డి, అలవల సురేష్, అయితా శ్రీధర్, గోకుల తిరుపాల్, వేనాడు ఎంపీటీసీ నదియా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్‌క్లబ్ సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, విష్ణువందన, డాక్టర్ జయలక్ష్మి, రమ, అనిత, స్నేహలత, విజయ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.